మానేరు

# జనత ®

తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక

9.7.2026 గురువారం Thursday | సంపుటి (Volume): 11 సంచిక (Issue) : 73 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar


## తిలక్ వర్మ పై బీసీసీఐ వేటు?




సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

ప్రోత్సాహకులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్


# తెలంగాణాలో గోద్రెజ్ భారీ పెట్టుబడి

### ఖమ్మంలో రూ. 300 కోట్లతో ఆయిల్ పామ్ ప్రాజెక్టు 700 మందికి పైగా ఉపాధి

- గుబ్బగుర్తిలో 113.5 ఎకరాల భూమి కేటాయింపు
- సీఎం రేవంత్ రెడ్డితో సంస్థ ప్రతినిధుల భేటీ
- సీడ్ గార్డెన్ కోసం భూమి కేటాయించాలని వినతి
- తెలంగాణలో పెట్టుబడులకు కెనడా ఆసక్తి
- సీఎం రేవంత్‌రెడ్డితో హైకమిషనర్ కూటర్ చర్చలు
- కెనడా పర్యటనకు సీఎంకు ఆహ్వానం



**జనతా న్యూస్, హైదరాబాద్ :** తెలంగాణాలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ప్రముఖ పారిశ్రామిక సంస్థ గోద్రెజ్ అగ్రోవెట్ కంపెనీ ముందుకొచ్చింది. ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామంలో రూ. 300కోట్ల పెట్టుబడితో రాష్ట్రంలోనే మొట్టమొదటి ప్రయివేటు సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్సు ఏర్పాటు చేయనుంది. ఈ ప్లాంటు ఏర్పాటుతో దాదాపు 700 మందికి పైగా ఉపాధి లభించనుంది. ఈ నేపథ్యంలో బుధవారం ఎంసీఆర్హెచ్ఆర్డీ బోధి పెవిలియన్లో సీఎం రేవంత్రెడ్డితో గోద్రెజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ ప్రె సిడెంట్( కార్పొరేట్ వ్యవహారాలు) రాకేష్ స్వామి, గోద్రేజ్ అగ్రోవెట్ ఆయిల్ పామ్ బిజినెస్ సీఈఓ సౌగతో నియోగి బేటీ అయ్యారు. గోద్రెజ్ ఆగ్రోవెట్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆయిల్పమ్ సాగు విస్తీర్ణంపై నివేదిక అందజేశారు. తెలంగాణలోనే - మొట్టమొదటి ప్రైవేట్ సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్ త్వరలో ప్రారంభం కానున్న నేప థ్యంలో ఈ భేటీలో పలు కీలక అంశాలపైన వారితో సీఎం చర్చించారు. గోద్రెజ్

మిగతా 2 లో



# పశ్చిమాసియాలో మళ్లీ రాజుకున్న అగ్గి

- ఇరాన్, అమెరికాల మధ్య పరస్పర దాడులు
- అమెరికా దాడులకు ప్రతిగా ఇరాన్ ప్రతిదాడులు
- బహ్రెయిన్, కువైట్‌లపై దాడులు

పశ్చిమాసియాలో మళ్లీ అగ్గి రాజుకుంటోంది. పశ్చిమాసియా మరోసారి నిప్పుల కొలిమిగా మారింది. అమెరికా-ఇరాన్ పరస్పర దాడులతో గల్ఫ్ దేశాల్లో సైరన్ల మోత మోగుతోంది. అగ్రరాజ్య దాడులపై తీవ్రంగా మండిపడ్డ టెహ్రాన్.. ప్రతీకార దాడులు మొదలుపెట్టింది. బహ్రెయిన్, కువైట్‌లో అమెరికాకు చెందిన 85 సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని క్షిపణులు ప్రయోగించింది. హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై దాడులకు ప్రతిస్పందనగా.. ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు, తీరప్రాంత నిఘా వ్యవస్థలపై అమెరికా వైమానిక దాడులు చేసింది. దీనిపై ఐఆర్‌జీసీ తీవ్రంగా స్పందించింది.

2

## పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు

- కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు
- ఏకంగా 1,677.12 పాయింట్లు పతనం
- దాదాపు 8.4 లక్షల కోట్ల రూపాయల సంపద ఆవిరి

# నీట్-యూజీ సోషియాలజీ ప్రశ్నాపత్రం లీక్

### ఎక్స్ వేదికగా రాహుల్ ఆరోపణలు



నీట్-యూజీ పరీక్ష వివాదంపై ఇంకా కొనసాగుతుండగానే యూజీసీ-నెట్ సోషియాలజీ ప్రశ్నపత్రంపై మరోసారి లీక్ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా చేసిన ఆరోపణలు వీటికి మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి.

2



### తాడిచెర్ల-2 కేటాయింపులపై

# తప్పుడు ప్రకటన

- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తప్పుదోవ పట్టించే యత్నం
- 2013 లోనే సింగరేణికి అధికారికంగా కేటాయింపు
- మీడియా సమావేశంలో మండిపడ్డ డిప్యూటి సిఎం భట్టి

సింగరేణి బొగ్గు గనుల కేటాయింపులపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రంగా ఖండించారు. సింగరేణి కాలరీస్‌కు తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్‌ను తామే కొత్తగా కేటాయించామని, దానికి సంబంధించిన కొన్ని క్లియరెన్సులు ఇచ్చామని కేంద్ర పెద్దలు ప్రచారం చేసుకోవడంపై మండిపడ్డారు. వాస్తవాలను పూర్తిగా పక్కన పెట్టి, ప్రజలను తప్పుదోవ పట్టించేలా వేరేలా చిత్రీకరించడం ఎంతమాత్రం కరెక్ట్ కాదని స్పష్టం చేశారు.

మీ సేవ

### యూరియా లభ్యతను

# మరింత సరళతరం

- మీసేవ కేంద్రాల ద్వారా యూరియా బుకింగ్
- యాప్ లో బుకింగ్ చేసుకోలేనివారికి సులువైన మార్గం

.. వివరాలు 2లో

### 3 నెలలు ఇరిగేషన్ అప్పగించు..

# నీళ్లు తెచ్చి పారిస్తం

**మేడిగడ్డకాడ నీళ్లున్నది వాస్తవం..**

**ఒడిసిపడ్తవా? ఏపీకి వదిలిపెడ్తవా?**

- కాలం కాకపోయినా మేడిగడ్డలో ప్రవాహం ఉంటది
- ఇప్పుడక్కడ 89,230 క్యూసెక్కుల నీళ్లు పోతున్నయ్
- సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌ది క్రిమినల్ నెగ్లిజెన్సీ
- కన్నెపల్లికాడ నీళ్లున్నా ఎత్తిపోయకపోవడం ఏంది?
- నీకు రైతు ప్రయోజనాలు ముఖ్యమా? రాజకీయాలా?
- వ్యాప్కోస్ చెఫ్ అయితే.. నువ్వేంది రేవంత్ రెడ్డీ?
- తెలంగాణకు వ్యాప్కోస్‌ను తెచ్చిందే కాంగ్రెస్ పార్టీ
- ఇంజినీర్ల రిపోర్టును మంత్రి ఉత్తమ్ బయటపెట్టాలె
- తమ్మిడిహట్టి అనుమతులు చూపిస్తే రాజీనామా చేస్త
- దేశంలో తక్కువ ఖర్చుతో పూర్తైన ప్రాజెక్టు కాళేశ్వరం
- కాంట్రాక్టర్ల కోసం చెక్‌డ్యామ్‌లను పేల్చిన చరిత్ర మీది
- పీపీటీలో బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత హరీశ్‌రావు నిప్పులు

03





### ఇంకెన్నాళ్లు కాళేశ్వరంపై

# కట్టుకథలు

### నీళ్లు లేక రైతులు అవస్థలు పడుతుంటే చోద్యమా

- గోదావరి నీళ్లు ఎత్తిపోయడమే శరణ్యం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఒకపక్క నీళ్లు లేక పల్లెల్లో రైతన్నల కన్నీళ్లు పెట్టుకుంటుంటే.. మరోపక్క మేడిగడ్డ కాడ లక్షల క్యూసెక్కుల నీళ్లు వృథాగా కిందకు పోతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.

03

# ధాన్యం కొనుగోళ్లలో కేంద్రంపై దుష్ప్రచారం

- సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ తీరుపై మండిపడ్డ కిషన్ రెడ్డి
- బిజెపి నేతలతో కలసి కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషితో భేటీ



ధాన్యం కొనుగోళ్లలో కేంద్రంపై సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ దుష్ప్రచారం చేస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడానికి కేంద్రం అంగీకారం తెలిపిందని పేర్కొన్నారు. కానీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో విఫలమైందని ధ్వజమెత్తారు.



### దేవాదాయ శాఖపై

# నేనెందుకు సమీక్షిస్తా

- నా అధికారమేంటో నాకు తెలియదా
- కొండా సురేఖ వ్యవహారంపై కడియం

.. వివరాలు 3లో

# తాడిచెర్ల-2 కేటాయింపులపై తప్పుడు ప్రకటన

## కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తప్పుదోవ పట్టించే యత్నం

## 2013 లోనే సింగరేణికి అధికారికంగా కేటాయింపు

## మీడియా సమావేశంలో మండిపడ్డ డిప్యూటి సీఎం భట్టి

**హైదరాబాద్,జూలై8 :** సింగరేణి బొగ్గు గనుల కేటాయింపులపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రంగా ఖండించారు. సింగరేణి కాలరీస్‌కు తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్‌ను తామే కొత్తగా కేటాయించామని, దానికి సంబంధించిన కొన్ని క్లియరెన్సులు ఇచ్చామని కేంద్ర పెద్దలు ప్రచారం చేసుకోవడంపై మండిపడ్డారు. వాస్తవాలను పూర్తిగా పక్కన పెట్టి, ప్రజలను తప్పుదోవ పట్టించేలా వేరేలా చిత్రీకరించడం ఎంతమాత్రం కరెక్ట్ కాదని స్పష్టం చేశారు. తాడిచెర్ల-2 బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం ఎప్పుడో 2013 లోనే సింగరేణి కాలరీస్‌కు అధికారికంగా కేటాయించిందని గుర్తుచేశారు. పైగా, గిరిజన ప్రాంతాలలో ఉండే బొగ్గు గనులను నిబంధనల ప్రకారం కేవలం ప్రభుత్వ కంపెనీలకు మాత్రమే ఇవ్వాల్సి ఉంటుందని, అలాంటప్పుడు ఇప్పుడు కొత్తగా మీరేదో అలాట్ చేసినట్లు చెప్పుకోవడం ఏంటని ప్రశ్నించారు. సింగరేణికి తాడిచర్ల కోల్ బ్లాక్ -2 కేటాయించినట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పారని.. కానీ వాస్తవాలు దాచిపెట్టి వేరేలా చిత్రీకరించడం సరికాదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం భట్టి మీడియాతో మాట్లాడుతూ.. 2013 సెప్టెంబర్ 16న ఈ కోల్ బ్లాక్‌ను ఆనాటి యూపీఏ ప్రభుత్వం సింగరేణికి కేటాయించిందని గుర్తుచేశారు. ఇప్పుడు కొత్తగా కోల్ బ్లాక్ కేటాయించినట్లు చెప్పడం ఏంటని ప్రశ్నించారు. మైనింగ్ లీజుకు దరఖాస్తు చేస్తే ఇన్నాళ్లూ పెండింగ్‌లో పెట్టారని.. ఎమ్‌ఎమ్‌బీఆర్ యాక్ట్ రాకముందే ఈ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించారని తెలిపారు. కేంద్ర మంత్రులను కలిసి చరిత్ర మొత్తం వివరించామని భట్టి అన్నారు. రాష్ట్రం నుంచి కొట్లాడి ఈ మైనింగ్ లీజుకు తెచ్చుకున్నామన్నారు. ట్రైబల్ ఏరియాలో ట్రైబల్స్ లేదా ప్రభుత్వ సంస్థలు మాత్రమే పని చేయాలని.. ప్రైవేట్ కంపెనీలు పని చేయడానికి అవకాశం లేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సత్తుపల్లి బ్లాక్ 3, కోయగూడెం బ్లాక్3కు టెండర్ వేశారని అన్నారు. బీఆర్ఎస్ బినామీలు ఆక్షన్‌లో పాల్గొని వాటిని దక్కించుకున్నారన్నారు. ఇన్నాళ్లూ సింగరేణికి తాడిచర్ల కోల్ బ్లాక్ లీజుకు ఇవ్వకపోవడం వల్ల వేల కోట్ల నష్టం జరిగిందని చెప్పుకొచ్చారు. గోదావరి పరిసరాల్లోని కోల్ బ్లాక్స్ అన్నింటినీ సింగరేణికి కేటాయించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. తాడిచెర్ల-2 బ్లాక్‌కు సంబంధించిన అసలు చరిత్రను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియా ముందుంచారు. 2021 లోనే తాము మైనింగ్ లీజుకు సిద్ధమయ్యామని చెప్తూ సింగరేణి యాజమాన్యం కేంద్రానికి దరఖాస్తు చేసుకుందన్నారు. కానీ, ఆ మైనింగ్ లీజుకు ఆమోదం ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం నాన్చుతూ ఇప్పటి వరకు ÷ళ్లైను పెండింగ్‌లో పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కంపెనీకి లీజు ఇవ్వకుండా ఇలా ఆపడం సరికాదని తానే స్వయంగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి కేంద్రంపై ఒత్తిడి తెచ్చామన్నారు. 2024 మార్చి లో అప్పటి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి, ఈ బ్లాక్‌కు సంబంధించిన పూర్వపరాలన్నింటినీ వివరించామని తెలిపారు. ఆ తర్వాత స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కలిసి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా వినతి పత్రం కూడా సమర్పించారని గుర్తుచేశారు. ఈ మైనింగ్ లీజు ఇవ్వకపోతే సింగరేణి సంస్థ తీవ్రంగా నష్టపోతుందనే వాస్తవాన్ని కేంద్రం ముందు ఉంచి, రాష్ట్ర ప్రభుత్వం ఎంతో పోరాడి ఆ అనుమతులు తెచ్చుకుందని స్పష్టం చేశారు. అదంతా దాచేసి, ఎప్పుడో ఉన్నదానికే తామే కేటాయించామని కేంద్రం ప్రచారం చేసుకోవడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వ ద్వంద్వ విధానాలను ఎండగడుతూ.. 2022 లో కోయగూడెంలోని బ్లాక్-3 ని కేంద్రం వేలంలో పెట్టి, నిబంధనలకు విరుద్ధంగా ఒక ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టిందని భట్టి విక్రమార్క ఆరోపించారు. అలా ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చిన ఆ బ్లాక్.. అప్పటి నుంచి ఇప్పటి వరకు కనీసం ఓపెన్ కూడా కాలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వానికి నిజంగానే సింగరేణి సంస్థకు మేలు చేయాలనే చిత్తశుద్ధి ఉంటే.. చట్టప్రకారం కోయగూడెం బ్లాక్-3 తో పాటు సత్తుపల్లి బ్లాక్-3 గనులను కూడా తక్షణమే సింగరేణికే అప్పగించాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణిని కనీసం వేలంలో కూడా పాల్గొననీయకుండా నష్టం చేసిందని మండిపడ్డారు. ఇప్పటికైనా కేంద్రం తన వైఖరి మార్చుకుని, గోదావరి పరిసర ప్రాంతాల్లో ఉన్న కోల్ బ్లాకులను, అలాగే తెలంగాణలోని అన్ని బొగ్గు గనులను సింగరేణి సంస్థకే కేటాయించాలని కోరారు.

# భీమ్‌రెడ్డి రిమాండ్ రిపోర్టులో కీలక అంశాలు

## 300 కోట్లకు పైగానే ఆస్తులు ఉన్నట్లు గుర్తింపు

## బినామీల పేరున ఆస్తులు...ముందే క్యాన్సిలేషన్ డీడ్‌లు

**హైదరాబాద్, జూలై8 :** ఎసిబికి చిక్కిన డీఎస్పీ భీమ్‌రెడ్డి రిమాండ్ రిపోర్టులో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఆయన నుంచి రెండు మెమరీ కార్డులను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. భీమ్‌రెడ్డి ఆస్తుల విలువ రూ.300 కోట్లపైన ఉంటుందని అంచనా వేశారు. ప్రస్తుతం ఉంటున్న విల్లా ఎలా కొన్నారనే విషయంపై ఆయన స్పష్టత ఇవ్వలేదని ఏసీబీ అధికారులు తెలిపారు. మెమరీ కార్డులు, డైరీల ద్వారా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయని అన్నారు. మెమరీ కార్డులోని వివరాల ఆధారంగా ఆస్తుల డాక్యుమెంట్లు సీజ్ చేసినట్లు చెప్పుకొచ్చారు. 'నాకు ఇవ్వాల్సిన వాళ్లు, నేను ఇవ్వాల్సినవి' అంటూ డీఎస్పీ భీమ్‌రెడ్డి తన డైరీలో రాసుకున్నాడని ఏసీబీ అధికారులు తెలిపారు. బినామీలు ఎప్పుడైనా తిరగబడే ప్రమాదం ఉందని ఆయన ముందే ఊహించాడని అన్నారు. అక్రమాస్తులు కూడబెట్టడంలో భీమ్‌రెడ్డి చాలా తెలివిగా వ్యవహరించాడని ఏసీబీ అధికారులు తెలిపారు. ఆస్తులను బినామీ పేర్ల మీద రిజిస్ట్రేన్ చేయించారని అన్నారు. బినామీల దగ్గర నుంచి క్యాన్సిలేషన్ డీడ్‌లను ముందే రాయించుకున్నాడని ఏసీబీ అధికారులు వెల్లడించారు.

# ఎన్నికలు ఎప్పుడైనా వార్ వన్ సైడే

## ఇప్పటికే బిఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పారు

## పేదల సొంతింటి కలను ప్రజా ప్రభుత్వం సాకారం చేస్తోంది

## జూరాల, నెట్టంపాడు ముంపు భూనిర్వాసితులకు ఇందిరమ్మ ఇండ్లు

## జోగులాంబ జిల్లాలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**జోగులాంబ గద్వాల,జూలై8 :** ఎప్పుడు ఎన్నికల వచ్చినా వార్ వన్ సైడేనని మళ్ళీ అధికారంలోకి వచ్చేది ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వమేనని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో జరిగిన అన్నిఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పడంతో పాటు, ప్రజా ప్రభుత్వానికి ప్రజల దీవెనలు అందించారన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం ర్యాలంపాడు గ్రామంలో జరిగిన సామూహిక ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు మరియు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో సహచర మంత్రి వాకిటి శ్రీహరి , ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి పొంగులేటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు చేసుకున్న లబ్దిదారులకు శుభాకాంక్షలు తెలిపి వారికి ఆత్మీయ చిరు కానుకలను అందించడం జరిగింది. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల రెండవ విడత మంజూరు పత్రాలను లబ్దిదారులకు పంపిణీ చేయడం జరిగింది. గద్వాల జిల్లా ప్రజలు చూపించిన అభిమానం మరువలేనిదన్నారు. పేదల ఆత్మ గౌరవానికి చిహ్నం ఇందిరమ్మ ఇండ్లు. దశాబ్దాల పేదల సొంతింటి కలను ప్రజా ప్రభుత్వంలో సాకారం చేస్తోంది. కుల, మత, రాజకీయాలకతీతంగా పేదలైతే అయితే చాలు ఇందిరమ్మ ఇల్లు కట్టించాలని ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. జూరాల, నెట్టంపాడు ముంపు భూ నిర్వాసితులకు కూడ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తాం. రెవెన్యూ శాఖ పరిధిలోని గద్వాల జిల్లా కావాల్సిన ఆర్డీవో, ఎమ్మార్వో కార్యాలయాలను కూడా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

# తెలంగాణాలో గోద్రెజ్ భారీ పెట్టుబడి



ఆగ్రో పెట్ సంస్థకు ఖమ్మం జిల్లాలో రూ. 300కోట్లపెట్టుబడితో కొనిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామం లో 113.5 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. అయితే సీడ్ గార్డెన్ కోసం అదనంగా 35 నుంచి 40 ఎకరాల భూమిని కేటాయించాలని ప్రభుత్వాన్ని గోద్రెజ్ సంస్థకోరింది. ప్రాసెసింగ్ మిల్ కోసం రహదారిని విస్తరించాలని ముఖ్యమంత్రిని ఆ సంస్థ ప్రతినిధులు కోరగా రోడ్డు విస్తరణ చేపట్టాలని టీజీఐఐసీని సీఎం ఆదేశించారు.

### తెలంగాణలో పెట్టుబడులకు కెనడా ఆసక్తి

కెనడా-తెలంగాణల మధ్య వ్యాపారం, వాణిజ్యం, పెట్టుబడులు, ఆవిష్కరణల రంగాల్లో భాగస్వామ్యాన్ని బలోపేతం చేద్దామని సీఎం రేవంత్రెడ్డి పిలుపునిచ్చారు.

భారత్లో కెనడా హైకమిషనర్ క్రిస్టోఫర్ కూటర్ బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో పెట్టుబడులు, ఇతర అంశాలపై ఇరు వురు చర్చించారు. సీఎం రేవంత్ నేతృత్వాన తెలంగాణ ప్రతినిధి బృందాన్ని కెనడా పర్యటనకు హైకమిషనర్ కూటర్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్రెడ్డి తెలంగాణ ఐటీ, లైఫ్ సైన్సెస్, రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లో సాధించిన పురోగతిని కూటర్ బృందానికి వివరించారు. మూసీ తీరం వెంట ఆర్థికవ్యవస్థ... మూసీనదీ తీరం వెంట కొత్త ఆర్థిక వ్యవస్థను నిర్మించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని సీఎం చెప్పారు. అలాగే రాష్ట్రంలో సౌర విద్యుత్ విస్తరణ, హరిత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి కెనడా సహకారం అందించాలని కోరారు. కెనడాకు చెందిన ప్రముఖ విశ్వవిద్యాలయాలు కలిసి హైదరాబాద్లో మల్టీ-యూనివర్సిటీ క్యాంపస్ ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు. ఈ ఏడాది డిసెంబర్లో నిర్వ హించనున్న రెండో తెలంగాణ గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్ సమ్మిట్లో పాల్గొనాలని కెనడా కంపెనీలు, పెట్టుబడిదారులు, విద్యా సంస్థలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానిం చారు. అనంతరం.. హైకమిషనర్ క్రిస్ కూటర్ మాట్లాడుతూ, ఇటీవల కెనడాకు చెందిన ప్రముఖ సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టడం సంతోషకరమని పేర్కొన్నారు. రాబోయే నెలల్లో కెనడా వాణిజ్య ప్రతినిధి బృందం తెలంగాణకు వచ్చి ఇంధన రంగం, పట్టణాభివృద్ధి, రక్షణ, ఏరోస్పేస్ తదితర రంగాల్లో పెట్టుబడులు, భాగస్వామ్య అవకాశాలపై విస్తృతంగా చర్చిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు కె. రామకృష్ణారావు, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ బి. అజిత్ రెడ్డి, టీజీఐఐసీ ఎండి శశాంక, ఐటీ, ఈ అండ్ సీజాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

### సీఎంతో మలేషియా ఎంపీ ఎం. శరవణన్ భేటీ...

పర్యావరణ, సామాజిక, పరిపాలనాపరమైన అంశాలతోపాటు మౌలిక సదు పాయాలు, ఏఐ వినియోగం, భవిష్యత్తు పెట్టుబడులపైన ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి తో మలేషియా ఎంపీ శరవణన్ చర్చించారు. ఈ మేరకు ఎంసీఆర్హెచ్ఆర్డీ బోధీ పెవిలియన్లో బుధవారం ఆయన ముఖ్య మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రీన్ గ్రోత్ ఎకనామిక్ సమ్మిట్ 2026లో పాల్గొనేందుకు ఎంపీ శరవణన్ హైదరాబాద్ వచ్చారు. ఈసమావేశంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కూడా పాల్గొన్నారు.

### ముఖ్యమంత్రిని కలిసిన అంతర్జాతీయ ప్రతినిధులు.

గ్రీన్ గ్రోత్ ఎకనామిక్ సమ్మిట్ -2026లో పాల్గొన్న పలువురు అంతర్జాతీయ ప్రతినిధులు సీఎం రేవంత్రెడ్డితో భేటీ అయ్యారు. బ్రూక్ఫీల్డ్ అసెట్ మేనేజ్మెంట్ కంపెనీ బోర్డు సలహాదారు నిలిగిల్బర్ట్, అమెరికా ప్రభుత్వ సలహాదారు, మొమెంటం టెక్నాలజీస్ సీఈఓ మహేష్ కొండూరు, ఆక్సన్ టెక్నాలజీస్ సీఈఓ అమిత్ మెహ్రా, నార్వే మాజీ స్టేట్ సెక్రటరీ దిలెక్, దక్షిణాఫ్రికా పార్లమెంట్ సభ్యుడు థామస్ ఫ్రోలిక్, సిలోన్ వర్కర్స్ కాంగ్రెస్ అధ్యక్షుడు సెంథిల్ తొండమాన్ తదితరులు సీఎంను కలిసినవారిలో ఉన్నారు.

# ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అభివృద్ధిలో ముందడుగు

## రూ.12 కోట్లతో నాగర్‌కర్నూల్ నూతన బస్ స్టేషన్‌కు శంకుస్థాపన

## నాగర్‌కర్నూల్-వనపర్తి మధ్య ఆర్టీసీ సర్వీసుల ప్రారంభం

## ఆర్టీసీని నష్టాల నుంచి లాభాల బాటలోకి తీసుకొచ్చాం

## మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి



**నాగర్‌కర్నూల్,జూలై8 :** రాష్ట్రం ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని రంగాల్లో అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థుల డైట్, కాస్మెటిక్ ఛార్జీలను పెంచి వారి సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో రూ.12 కోట్ల వ్యయంతో నిర్మించనున్న నూతన ఆర్టీసీ బస్ స్టేషన్‌కు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మరో మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం నాగర్‌కర్నూల్ నుంచి వనపర్తి వరకు కొత్తగా ప్రారంభించిన ఆర్టీసీ బస్సు సర్వీసులను ప్రారంభించి, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ కార్యాలయాన్ని కూడా మంత్రులు ప్రారంభించారు. అనంతరం ఉయ్యాలవాడ బీసీ గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించి, అక్కడి వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, టీజీఎస్‌ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజలకు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఆధునిక బస్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషకరమని తెలిపారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మహాలక్ష్మి పథకం అమలుతో ఇప్పటివరకు 320 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించి, సుమారు రూ.11,371 కోట్ల మేర ప్రయాణ ఖర్చును ఆదా చేసుకున్నారని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ కార్మికులు 55 రోజులపాటు సమ్మె చేయాల్సిన పరిస్థితులు ఏర్పడి, పలువురు ఆత్మహత్యలకు పాల్పడిన దురదృష్టకర పరిస్థితులను రాష్ట్రం చూసిందన్నారు. అయితే ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం కేవలం మూడు రోజుల్లో కార్మికుల సమస్యలను పరిష్కరించిందని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వం కార్మికుల సంక్షేమం, సంస్థ అభివృద్ధి, ప్రయాణికుల సౌకర్యం అనే మూడు ప్రధాన లక్ష్యాలతో ముందుకు సాగుతోందన్నారు. గత పదేళ్లలో ఒక్క కొత్త బస్సును కూడా కొనుగోలు చేయలేదని, ఒక్క ఉద్యోగాన్ని కూడా భర్తీ చేయలేదని విమర్శించారు. ప్రజాపాలన ప్రభుత్వంలో ఆర్టీసీని ఆపరేషనల్ నష్టాల నుంచి లాభాల దిశగా తీసుకువచ్చామని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని అమలు చేయడంతో పాటు బాండ్లు, డీఏలు విడుదల చేశామని, కారుణ్య నియామకాలు చేపట్టి కొత్త ఉద్యోగాల భర్తీ ప్రారంభించామని చెప్పారు. కొత్త బస్సుల కొనుగోలు కూడా కొనసాగుతోందన్నారు. గతంలో విధుల నుంచి తొలగించబడిన ఉద్యోగులను తిరిగి సేవల్లోకి తీసుకున్నామని వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 10 వేల ఆర్టీసీ బస్సులు ప్రతిరోజూ సుమారు 30 లక్షల కిలోమీటర్లు ప్రయాణిస్తూ 65 లక్షల మంది ప్రయాణికులకు సేవలందిస్తున్నాయని మంత్రి వివరించారు. హైదరాబాద్ నగరంలో కొత్తగా 375 రూట్లలో బస్సులు నడుపుతూ ప్రతిరోజూ అదనంగా 7 లక్షల మంది ప్రయాణికులకు సేవలు అందిస్తున్నామని, అవసరమున్న ప్రాంతాల్లో మరిన్ని సర్వీసులు ప్రారంభిస్తామని తెలిపారు. ప్రభుత్వం ప్రతి అర్హ కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తోందని, గతంలో రేషన్ కార్డుల కోసం ప్రజలు చెప్పులు అరిగేలా తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు కొత్త రేషన్ కార్డులు జారీ చేసి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. మహిళలకు చీరల పంపిణీ, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందించడం, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా వారిని సాధికారత దిశగా నడిపిస్తున్నామని పేర్కొన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో ప్రజల ఆకాంక్షల కోసం రాజీనామా చేసి పోరాటం చేసిన రోజుల్ని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ÷రిలిడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు ట్రాఫిక్, రోడ్డు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని మంత్రులు పిలుపునిచ్చారు. రవాణా శాఖ, పోలీసు శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్న 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు

# యూరియా లభ్యతను మరింత సరళతరం

## మీసేవ కేంద్రాల ద్వారా యూరియా బుకింగ్

## యాప్ లో బుకింగ్ చేసుకోలేనివారికి సులువైన మార్గం

**హైదరాబాద్,జూలై8 :** రాష్ట్రంలోని రైతులకు సబ్సిడీ యూరియా అందుబాటును మరింత సులభతరం చేయటం కోసం ప్రభుత్వం వినూత్న నిర్ణయం తీసుకుంది. పారదర్శకతను పెంపొందిస్తూ, సకాలంలో యూరియా పంపిణీ చేయటం కోసం రాష్ట్ర వ్యవసాయశాఖ యూరియా బుకింగ్ సేవను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని మీసేవ కేంద్రాల ద్వారా అందుబాటులోకి తీసుకువచ్చింది. ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకోలేని రైతులు తమ సమీపంలోని మీ సేవ కేంద్రాన్ని సందర్శించి, ఆపరేటర్ సహాయంతో యూరియా బుకింగ్ చేసుకోవచ్చు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల. శ్రీధర్ బాబు నేతృత్వంలో పనిచేస్తున్న మీసేవ, వ్యవసాయశాఖతో కలిసి ఈ కొత్త చొరవను ప్రారంభిస్తుంది. రైతు తన పట్టాదారు పాస్‌బుక్ నంబర్‌తో సమీపంలోని మీ సేవ కేంద్రాన్ని సందర్శించాలి. మీ సేవ ఆపరేటర్ రైతు వివరాలను సేకరించి, సాగు విస్తీర్ణం మరియు పంట వివరాలను నమోదు చేస్తారు. రైతు ఎంపిక చేసిన ఎరువుల డీలర్ వద్ద అవసరమైన యూరియా పరిమాణాన్ని బుక్ చేస్తారు. రైతు నమోదిత మొబైల్ నంబర్‌కు పంపిన ఓటిపిని ధృవీకరించిన తర్వాత వెంటనే బుకింగ్ ఐడి జారీ చేయబడుతుంది. మీ సేవ ద్వారా పొందిన బుకింగ్ ఐడి బుకింగ్ చేసిన తేదీని మినహాయించి 48 గంటలపాటు మాత్రమే చెల్లుబాటు అవుతుంది. బుకింగ్ గడువు ముగిసేలోపు రైతులు ఎంపిక చేసిన ఎరువుల డీలర్‌ను సంప్రదించి యూరియాను కొనుగోలు చేయాలి. సబ్సిడీ యూరియా బుకింగ్‌ను అధికారిక ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ లేదా మీ సేవ కేంద్రాల ద్వారానే చేయాలని వ్యవసాయశాఖ సూచిస్తోంది. ఓటిపి అందుకోవడానికి రైతులు తమ పట్టాదారు పాస్ బుక్ తో అనుసంధానమైన మొబైల్ నంబర్ యాక్టివ్‌లో ఉండేలా చూసుకోవాలి. కేవలం పదిరూపాయల నామమాత్రపు సేవా రుసుముతో మీసేవ ద్వారా రైతులు అందరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు. ఏవైనా సందేహాలు లేదా సహాయం కోసం సమీప వ్యవసాయ విస్తరణ అధికారి, మండల వ్యవసాయ అధికారి లేదా సమీప మీసేవ కేంద్రాన్ని సంప్రదించవచ్చు. ఈ సౌకర్యాన్ని రాష్ట్రంలోని రైతులందరూ వినియోగించుకొని, సబ్సిడీ యూరియాను అధికారిక బుకింగ్ విధానం ద్వారా పొందాలని వ్యవసాయశాఖ విజ్ఞప్తి చేస్తోంది.

# 3 నెలలు ఇరిగేషన్ అప్పగించు.. నీళ్లు తెచ్చి పారిస్తం

## మేడిగడ్డకాడ నీళ్లున్నది వాస్తవం..

## ఒడిసిపడ్తవా? ఏపీకి వదిలిపెడ్తవా?

- కాలం కాకపోయినా మేడిగడ్డలో ప్రవాహం ఉంటది
- ఇప్పుడక్కడ 89,230 క్యూసెక్కుల నీళ్లు పోతున్నయ్
- సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌ది క్రిమినల్ నెగ్లిజెన్సీ
- కన్నెపల్లికాడ నీళ్లున్నా ఎత్తిపోయకపోవడం ఏంది?
- నీకు రైతు ప్రయోజనాలు ముఖ్యమా? రాజకీయాలా?
- వ్యాపోస్ చెఫ్ అయితే.. నువ్వేంది రేవంత్ రెడ్డి?
- తెలంగాణకు వ్యాపోస్‌ను తెచ్చిందే కాంగ్రెస్ పార్టీ
- ఇంజనీర్ల రిపోర్టును మంత్రి ఉత్తమ్ బయటపెట్టాలె
- తమ్మిడిహట్టి అనుమతులు చూపిస్తే రాజీనామా చేస్త
- దేశంలో తక్కువ ఖర్చుతో పూర్తైన ప్రాజెక్టు కాళేశ్వరం
- కాంట్రాక్టర్ల కోసం చెక్‌డ్యామ్‌లను పేల్చిన చరిత్ర మీది
- పీపీటీలో బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత హరీశ్‌రావు నిప్పులు

**హైదరాబాద్,జూలై8 :** గోదావరిలో నీళ్లు ఉన్నా ఎత్తిపోయకపోవడం క్రిమినల్ నెగ్లిజెన్స్ కిందకే వస్తుందని.. మిమ్మల్ని ఉరి తీసినా తప్పు లేదని సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఫైర్ అయ్యారు. గురువు చంద్రబాబుకు దక్షిణ చెల్లించడానికే గోదావరి నీళ్లను వదిలేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లించేందుకే సీఎం రేవంత్ రెడ్డి నీటిని కిందికి వదులు తున్నారన్నారు. ధర్మసాగర్, రామప్ప చెరువులు ఖాళీగా ఉంటే ఎందుకు నింపడం లేదన్నారు. కాళేశ్వరం కింద ప్రాజెక్టుల్లో నీళ్లు నింపి రైతులకు ఇవ్వాలని ఎందుకు అనుకోవడం లేదన్నారు. ఈ రోజు కూడా సమ్మక్క సాగర్ బ్యారేజీలో 1,08,000 క్యూసెక్కుల వరద ప్రవాహం ఉంది. దేవాదుల ప్రాజెక్టు అన్ని ఫేజులు కలిపి ఒక్కరోజులో 2,542 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయ వచ్చున్నారు. సాధారణంగా దేవాదుల మోటర్లు 71 మీటర్ల నీళ్లు ఉంటే పనిచేస్తాయి, కానీ ఇప్పుడు 75 మీటర్ల నీళ్లు ఉన్నాయి. అంటే నీళ్లు ఉండి కూడా కావాలని ఎత్తిపోయడంలేదని ఆరోపించారు. దేవాదుల ప్రాజెక్టులో సగానికి పైగా మోటార్లు అసలు ఆన్ చేయలేదు.మీ నిర్లక్ష్యం వల్ల ఉమ్మడి వరంగల్ జిల్లాలో దాదాపు 80శాతం చెరువులు ఎండిపోయి ఉన్నాయన్నారు.




మేడిగడ్డ దగ్గర బ్యారేజ్ కట్టొద్దని నిపుణులు ఎక్కడా చెప్పలేదని.. మేడిగడ్డ దగ్గర బ్యారేజ్ నిర్మించేందుకు అనుకూలంగానే ఉందని రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ నివేదిక ఇచ్చిందని హరీశ్ రావు స్పష్టం చేశారు. మేడిగడ్డ నుండి 160టీఎంసీల నీళ్లు మిడ్ మానేరు తీసుకువెళ్లేందుకు పరిస్థితులు అనుకూలిస్తాయా లేదా అన్న దాని గురించి మా కమిటీ వేశారని రిటైర్డ్ ఇంజనీర్లు చెప్పారు. పీసీ ఘోష్ కమిషన్‌కు కూడా ఈ రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ నివేదిక ఇచ్చిందని హరీశ్ రావు అన్నారు. మేడిగడ్డ దగ్గర బ్యారేజ్ కట్టొచ్చు కానీ నేరుగా మిడ్ మానేరుకు నీరు తీసుకెళ్లడం సాధ్యం కాదని ఆనాడు కమిటీ చెప్పింది. కమిటీ సూచనల మేరకు నేరుగా నీళ్లు తరలించే ప్రతిపాదనను బీఆర్ఎస్ ప్రభుత్వం ఉపసంహరించుకుందని రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ పీసీ ఘోష్ కమిషన్‌కు నివేదిక ఇచ్చిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మేము చెప్పినట్టే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిందని అఫిడవిట్ రూపంలో పీసీ ఘోష్ కమిషన్‌కు రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ తెలిపింది. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ రిపోర్టు పట్టించుకోలేదని రేవంత్ రెడ్డి చిల్లర మాటలు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. మేడిగడ్డ దగ్గర చిన్న రబ్బర్ డ్యామ్ వేసి మోటార్లు ఆన్ చేసి కాళేశ్వరం నీళ్లు వాడుకోవచ్చని రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇంజనీర్లు ఒక రిపోర్ట్ ఇచ్చారని.. ఉత్తమ్ కుమార్ రెడ్డి నీకు చిత్తశుద్ధి ఉంటే ఆ రిపోర్ట్ బయట పెట్టాలని హరీశ్ రావు సవాల్ విసిరారు. ఆ రిపోర్ట్ ఇచ్చిన వారం రోజుల్లోనే ట్రాన్స్‌ఫర్ చేసి పోస్టింగ్ ఇవ్వకుండా రిటైర్ చేశారు. మీకు కాళేశ్వరం అంటే అంత పగా, ప్రతీకారం ఎందుకని హరీశ్ రావు ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నెగిటివ్ మైండ్‌సెట్‌తో ఉన్నారని హరీశ్ రావు వ్యాఖ్యానించారు. కన్నెపల్లి మోటార్లు ఆన్ చేయమంటే ఎన్‌డీఎస్‌ఏ సాకు చెబుతున్నారని.. మరి సమ్మక్క బ్యారేజీ మోటార్లు ఎందుకు ఆన్ చేయడం లేదని ప్రశ్నించారు. ఈ నిమిషానికి సమ్మక్క బ్యారేజీ దగ్గర లక్ష క్యూసెక్కుల ప్రవాహం ఉందని చెప్పుకొచ్చారు. గోదావరి నీళ్లు తీసుకోవాలన్న కనీస సోయి లేదని విరుచుకుపడ్డారు. చెరువులు నింపుకునే అవకాశం ఉన్నా.. నింపడం లేదన్నారు. దేవాదుల మోటార్లు పూర్తిస్థాయిలో నడపడం లేదని తెలిపారు. మోటార్లు ఆన్ చేయకుండా.. నీళ్లను దిగువకు వదులుతున్నారని అన్నారు. గురుదక్షిణగా తెలంగాణ నీటిని ఏపీకి వదులుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌ది నేరపూరిత నిర్లక్ష్యమని మాజీ మంత్రి విమర్శలు గుప్పించారు. నీళ్లు ఉండి కూడా లిఫ్ట్ చేయకపోవడం క్రిమినల్ నెగ్లిజెన్స్ అంటూ వ్యాఖ్యానించారు. క్రిమినల్ నెగ్లిజెన్స్‌కు పాల్పడిన రేవంత్, ఉత్తమ్‌ను ఉరితీసినా తప్పులేదన్నారు. అబద్దానికి ప్యాంటు షర్ట్ వేస్తే సీఎం రేవంత్ అని.. అబద్దాల్లో ఆయనను మించినవారు లేరంటూ దుయ్యబట్టారు. నిన్నటి రేవంత్ ప్రసంగంలో సొల్లు తప్ప.. నిజం లేదని అన్నారు. తుమ్మిడిహెట్టికి అనుమతులున్నాయని అబద్దాలు చెప్పారని.. అనుమతు లుంటే తట్టెడు మట్టి ఎందుకు తీయలేదని నిలదీశారు. 8 ఏళ్లు కేంద్రం, రాష్ట్రం, మహారాష్ట్రలో అధికారంలో ఉండి ఎందుకు కట్టలేదని ప్రశ్నించారు. పనులు చేయకుండా తుమ్మిడిహెట్టి పేరిట రూ.2,328కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. నీటి పారుదల మంత్రిగా ఉత్తమ్, సీఎంగా రేవంత్ విఫలం అంటూ వ్యాఖ్యానించారు. 'తుమ్మిడిహెట్టికి మహారాష్ట్ర అనుమతి ఇచ్చి ఉంటే అగ్రిమెంట్ బయటపెట్టాలి. ఒప్పందం బయటపెడితే రాజీనామాకు సిద్ధం. లేకపోతే సీఎం రేవంత్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు సవాల్ విసిరారు.

# ధాన్యం కొనుగోళ్లలో కేంద్రంపై దుష్ప్రచారం

## సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ తీరుపై మండిపడ్డ కిషన్ రెడ్డి

## బిజెపి నేతలతో కలసి కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషితో భేటీ

**న్యూఢిల్లీ,జూలై8 :** ధాన్యం కొనుగోళ్లలో కేంద్రంపై సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ దుష్ప్రచారం చేస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడానికి కేంద్రం అంగీకారం తెలిపిందని పేర్కొన్నారు. కానీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో విఫలమైందని ధ్వజమెత్తారు. బుధవారం కేంద్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని తెలంగాణ బీజేపీ నేతలు ఢిల్లీలో కలిశారు. ధాన్యం కొనుగోళ్లు, బియ్యం సేకరణ అంశాలపై కేంద్రమంత్రికి బీజేపీ నేతలు విజ్ఞాపనపత్రం అందజేశారు. ఈ సమావేశంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యేలు వెంకట రమణారెడ్డి, పాయల శంకర్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, తెలంగాణ బీజేపీ కిసాన్ మోర్చా నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. తాము చేపట్టిన రైతుగోస ఉద్యమం తర్వాత ధాన్యం కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేసిందని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రైస్ మిల్లుల్లో మిల్లింగ్ వేగవంతం చేసి ఈఅఎకి బియ్యాన్ని పంపాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని తెలిపారు. ధాన్యం కొనుగోలు, మిల్లింగ్‌లో సరైన విధంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేయాలని సూచించారు. ఖరీఫ్ 2024-25లో 36 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు కేంద్రం అంగీకరిస్తే ఈరోజు వరకు 13 నుంచి 14 శాతం బియ్యం కూడా ఎందుకు పంపలేదని ప్రశ్నించారు. 2024-26 ఖరీఫ్ సీజన్‌లోని బియ్యం ఇంకా ఈఅఎకి చేరలేదని కిషన్‌రెడ్డి ప్రస్తావించారు. బీఆర్ఎస్ హయాంలో కూడా ఇదేవిధంగా వ్యవహారం చారని చెప్పుకొచ్చారు. ధాన్యం కొనుగోళ్ల కోసం ఔఅఆఅ ద్వారా రాష్ట్రాలకు కేంద్రం రుణాలు ఇస్తోందని వివరించారు. 2024-26లో రూ.37 వేల కోట్లు రాష్ట్రానికి రుణాలు ఇచ్చామని వెల్లడించారు. 2026-27లో కూడా సుమారు రూ.23 వేల కోట్లు రుణాలు ఇచ్చామని తెలిపారు. ఢిల్లీలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి ధర్నా చేయాలని.. వాస్తవాలు చెబుతామని అన్నారు. కేంద్రం చిత్తశుద్ధితో పనిచేస్తోందని స్పష్టం చేశారు. రైతుల ధాన్యం ఉత్పత్తి స్థాయికి తగ్గట్లుగా మౌలిక వసతులు పెంచాలని డిమాండ్ చేశారు. పేదలకు ఇచ్చే సన్నబియ్యంలో 70 శాతం నిధులను కూడా కేంద్రమే



ఇస్తోందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగం పండించిన పంట సేకరణ విషయంలో 54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు. తాము చేపట్టిన రైతు గోస ద్వారా రైతుల ఆందోళనను స్వయంగా చూశామని తెలిపారు. తెలంగాణ రైతులను ఆదుకోవాలని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి విజ్ఞప్తి చేశామని అన్నారు. అదనపు ధాన్యం కొనుగోలుకు కేంద్రం అంగీకరించినందుకు కేంద్రమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. 2013-14లో అప్పటి యూపీఏ-2లో కాంగ్రెస్ ప్రభుత్వం 24.32 లక్షల మెట్రిక్ టన్నులనూ మాత్రమే ధాన్యం కొనుగోళ్లు చేసిందని ప్రస్తావించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ హయాంలో కేంద్రప్రభుత్వం 146.33 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో కొన్నదానికంటే 6 రెట్లు ఎక్కువగా మోదీ హయాంలో కొనుగోలు చేశామని ఎంపీ రఘునందన్ రావు తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో కేంద ప్రభుత్వంపై చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నామని అన్నారు. వరికి రూ.2369 ఓ÷ూఖ చెల్లిస్తున్నామని, కాంగ్రెస్ హయాంలో వరికి రూ.1300 ఓ÷ూఖ ఇచ్చిందని తెలిపారు. వడ్ల కొనుగోలుకు రూ.34891 కోట్లని తెలంగాణలో ధాన్యం కొనుగోలుకు కేంద్రం ఇచ్చిందని చెప్పారు. రాష్ట్ర ప్రజలు, రైతుల పక్షాన తాము నిలబడతామని మాటిచ్చారు. ధాన్యం కొనుగోళ్లను కేంద్రం చేస్తే మర ఆడించి బియ్యం పంపడానికి కూడా రాష్ట్ర ప్రభుత్వానికి ఆరు నెలల సమయం ఎందుకు పడుతోందని ఎంపీ రఘునందన్ రావు ప్రశ్నించారు.

# వరుసగా మూడరోజూ కమిటీ భేటీ

## వివిధ విశ్వవిద్యాలయాల విద్యార్థులు, అధ్యాపకులతో చర్చ

**హైదరాబాద్,జూలై8 :** తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో పాల్గొన్న నిజమైన ఉద్యమకారుల గుర్తింపు, వారి సంక్షేమమే ఆశయంగా ఏర్పడిన ఉన్నత స్థాయి కమిటీ అధికారిక సమావేశాలు 'తెలంగాణ అమర జ్యోతి' ప్రాంగణంలో ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ సంప్రదింపుల పక్రియ బుధవారానికి విజయవంతంగా 3వ రోజుకు చేరుకుంది. కమిటీ గౌరవ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు అధ్యక్షతన, కమిటీ సభ్యులు సమక్షంలో ష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల విద్యార్థి ఉద్యమకారులు మరియు అధ్యాపక ప్రతినిధులతో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఈనాటి కీలక సమావేశంలో జేఎన్‌టీయూహెచ్ , తెలంగాణ యూనివర్సిటీ, మహాత్మా గాంధీ యూనివర్సిటీ, పాలమూరు యూనివర్సిటీ, శాతవాహన యూనివర్సిటీ , తెలుగు విశ్వవిద్యాలయం, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, మరియు కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయాలకు చెందిన మలిదశ ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సమావేశంలో పాల్గొన్న వివిధ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు కమిటీ ముందు తమ ఆకాంక్షలను, విలువైన సలహాలను ఉంచారు. ఉద్యమకారులను కేవలం రాజకీయాల కోణంలో కాకుండా పారదర్శకంగా గుర్తించాలని కోరారు. ముఖ్యంగా, కేవలం ఐడెంటిటీ కార్డుల జారీతో సరిపెట్టకుండా, ఉద్యమ సమయంలో సర్వస్వం కోల్పోయిన కుటుంబాలను ఆదుకోవడానికి విద్యా, వైద్య, ఆర్థిక రంగాల్లో విప్లవాత్మకమైన 'సామాజిక సంస్కరణలు' తీసుకురావాలని, తద్వారా ఆయా కుటుంబాలకు శాశ్వత సామాజిక భద్రత కల్పించాలని గట్టిగా విజ్ఞప్తి చేశారు. 'తెలంగాణ మలిదశ ఉద్యమ రథసారధులు మన విద్యార్థులు మరియు మేధావులు. 3వ రోజు ముమ్మరంగా జరిగిన ఈ సమావేశాలలో వివిధ వర్సిటీల నుండి వచ్చిన ప్రతినిధులు అత్యంత విలువైన ప్రతిపాదనలను, సామాజిక సంస్కరణల విజ్ఞాపనలను కమిటీకి అందించారని చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా, నిఖార్సైన ప్రతి ఒక్క ఉద్యమకారుడిని గుర్తించి, గౌరవించడమే మా ప్రభుత్వ ప్రధాన సంకల్పం. ఈ రోజు సేకరించిన అన్ని నివేదికలను మరియు సామాజిక భద్రతా ప్రతిపాదనలను త్వరలోనే గౌరవ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తాం. ఉద్యమకారుల త్యాగాలకు తగిన న్యాయం జరిగేలా కమిటీ తుది నివేదికను పారదర్శకంగా సిద్ధం చేస్తుందని అన్నారు.

# ఇంకెన్నాళ్లు కాళేశ్వరంపై కట్టుకథలు

## గోదావరి నీళ్లు ఎత్తిపోయడమే శరణ్యం : కేటీఆర్

**హైదరాబాద్,జూలై8 :** ఒకపక్క నీళ్లు లేక పల్లెల్లో రైతన్నల కన్నీళ్లు పెట్టుకుంటుంటే.. మరోపక్క మేడిగడ్డ కాడ లక్షల క్యూసెక్కుల నీళ్లు వృథాగా కిందకు పోతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంలో నీరో చక్రవర్తిని మించిపోయి సర్కారు తమాషా చూస్తున్నదని మండిపడ్డారు. కేసీఆర్ మీద కక్షతో రైతన్నలకు శిక్ష వేయడం తగునా అని నిలదీశారు. ఎల్‌నినో పడగ విప్పుతుంటే..ముప్పు ముంచుకొస్తుంటే ఇంకా రాక్షస రాజకీయ క్రీడలు ఆడుతూ కూర్చుంటారా? ఇంకెన్నాళ్లు కాళేశ్వరం మీద దుష్ప్రచారాలు చేస్తూ కాలక్షేపం చేస్తారు? ముఖ్యమంత్రికి రైతు ముఖ్యమా? రాజకీయం ముఖ్యమా? అని మండిపడ్డారు. మీ పగలు.. ప్రతీకారాలు ప్రతిపక్షం మీద తీర్చుకోండి, అన్నంపెట్టే రైతును మాత్రం ఆగం చేయకండి అని హితవు పలికారు. కాళేశ్వరంలో నిండుగా నీళ్లు పారుతున్నా మీ పొలాలను ఎండబెతున్న కాంగ్రెస్ కర్కశ పాలన తీరును ప్రశ్నించండి అని తెలంగాణ రైతన్నలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. ఎక్కడా చుక్కనీళ్లు లేని కాలంలోనూ.. కాళేశ్వరమే ప్రాణెశ్వరమై కాపాడుతుందని అర్థం చేసుకోవాలన్నారు.వానల్లేక.. ఎవుసం జరగక అన్నదాత అల్లాడుతుంటే ప్రభుత్వానికి పాపం అనిపించడం లేదా? కాళేశ్వరం దగ్గర పరవళ్లు తొక్కుతున్న గోదావరి జలాలను ఎత్తిపోసి..గోస తీర్చాలన్న సోయి కలగట్లేదా? అని సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు. లోటు వర్షపాతంతో నాట్లు పడట్లేదు.. విత్తనాలు వేయట్లేదు.. పంటలు సాగుచేసే పరిస్థితి లేదని అన్నారు. ప్రభుత్వమేమో ఏమీ పట్టించుకోకుండా దున్నపోతు మీద వానపడ్డట్టే వ్యవహరిస్తున్నదని తెలిపారు. కన్నెపల్లి పంప్ హౌజ్ మోటర్లను నడిపించి.. కరువు రాకుండా కాపాడు కోవాలన్న బుద్ధి ఎందుకు లేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

# తెలంగాణ సంపన్న రాష్ట్రం అంటూ ప్రపంచ బ్యాంక్ నివేదిక

## రాష్ట్రం వస్తే ఏమొచ్చిందన్న వారికిదే సమాధానం.. ఎక్స్ వేదికగా కెటిఆర్ హర్షం

**హైదరాబాద్,జూలై8 :** తెలంగాణ ఎగువ మధ్యాదాయ స్థాయిని దాటిన సంపన్న రాష్ట్రమంటూ ప్రపంచబ్యాంకు నివేదికను వెల్లడించడంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. దేశంలో ఈ హోదాను సాధించిన ఐదు అగ్ర రాష్ట్రాల్లో తెలంగాణ ఉండటం గర్వకారణమన్నారు. తెలంగాణ విఫల రాష్ట్రం కాలేదని.. సఫల సంపన్న రాష్ట్రమై సగర్వంగా నిలిచిందని పేర్కొన్నారు. 'తెలంగాణ ప్రజలు గర్వించే సందర్భం ఇది! సాధించుకున్న స్వరాష్ట్రం సంపన్న రాష్ట్రంగా అవతరించింది! తెలంగాణ రాష్ట్రం అప్పర్ మిడిల్ ఇన్‌కం బెంచ్ మార్క్‌ను దాటి ఎదిగిందని ప్రపంచ బ్యాంకు నివేదిక వెల్లడించింది! దేశంలో ఈ హోదాను సాధించిన ఐదు అగ్ర రాష్ట్రాల్లో తెలంగాణ ఉండటం మనకు గర్వకారణం అన్నారు. తమ చెమటను.. నైపుణ్యాన్ని.. మేధస్సును రంగరించి తెలంగాణను శిథిలాల నుంచి శిఖరాలకు చేర్చిన ప్రతి పౌరుడికీ శుభాభివందనాలు! తెలంగాణ వస్తే ఏమొచ్చింది? జాతి సంపద పెరిగింది.. జనం ఆదాయం అద్భుతంగా పెరిగింది! కేసీఆర్ దార్శనిక పాలనలో ఆర్థిక వ్యవస్థ అద్వితీయంగా అభివృద్ధి చెందిందని జాతీయ నివేదికలే కాదు.. అంతర్జాతీయ సంస్థలు తేల్చిచెబుతున్నాయి..! దివాలా రాష్ట్రం అని దిక్కుమాలిన ప్రచారాలు చేసేవాళ్లకు ప్రపంచ బ్యాంకు తాజా నివేదికే సమాధానం..!' అని ఎక్స్‌లో కేటీఆర్ పోస్ట్ చేశారు.

# దేవాదాయ శాఖపై నేనెందుకు సమీక్షిస్తా

## నా అధికారలేంటో నాకు తెలియదా.. కొండా సురేఖ వ్యవహారంపై కడియం

**జనగామ,జూలై8 :** తాను ఎక్కడా దేవాదాయ శాఖ అధికారులతో సమీక్షలు చేయడం కానీ, మంత్రి కొండా సురేఖ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం కానీ చేయలేదని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. జిల్లా వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారంటూ స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై ఏఐసీసీకి మంత్రి కొండా సురేఖ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ.. 'నేను ఏ తప్పూ చేయలేదు.. వివరణ ఎందుకు ఇస్తా' అని అన్నారు. ప్రోటోకాల్‌కు లోబడే పనిచేస్తానని స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని పలు ఆలయాల సమస్యలపై సంబంధిత శాఖ అధికారులు, ఆలయ చైర్మన్లను కలిశానని చెప్పారు. అధికారులతో ఎలాంటి సమీక్ష నిర్వహించలేదని, సమస్యలు మాత్రమే విన్నవించినట్లు వివరించారు. దేవదాయ శాఖలో నిధులు లేవంటే... నియోజకవర్గం లోని ఆలయాల సమస్యల పరిష్కారానికి ఎస్టిమేషన్‌లను మాత్రమే కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆ శాఖపై సమీక్ష నిర్వహించే హక్కు తనకు లేదని తెలుసన్నారు. ఇదంతా అవగాహన లోపంతోనే జరుగు తోందన్నారు. కొందరు కొత్త అలవాట్లు నేర్చుకున్నారని.. కాంట్రవర్సీ క్రియేట్ చేస్తూ ప్రజల మధ్యలో ఉండాలనుకుంటున్నారని వ్యాఖ్యానించారు. నియోజకవర్గ సమస్యల పరిష్కారం కోసం.. మంత్రులను అవసరమైతే ముఖ్యమంత్రిని కూడా కలుస్తానని చెప్పారు. ఆలయాల సమస్యల పరిష్కారం కోసం మాత్రమే కమిషనర్‌ను కలిసినట్లు కడియం శ్రీహరి స్పష్టం చేశారు.

# 20 నుంచి 22 వరకు బల్కంపేట ఎల్లమ్మ బోనాల ఉత్సవాల

## అమ్మవారి వార్షిక కళ్యాణోత్సవాలపై మంత్రి సురేఖ సమీక్ష

**హైదరాబాద్,జూలై8 :** నగరంలోని బల్కంపేట ఎల్లమ్మ బోనాల ఉత్సవాలకు సర్వం సిద్ధం చేయాలని అధికారులను దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. జులై 20 నుంచి 22 వరకు ఎల్లమ్మ అమ్మవారి వార్షిక కళ్యాణోత్సవాలు జరుగుతాయని వివరించారు. జులై 20 సాయంత్రం ఎదుర్కోలు ఉత్సవంతో ఈ వేడుకలు ప్రారంభమవుతాయని తెలిపారు.బల్కంపేట ఎల్లమ్మ దర్శనం అష్టాదశ శక్తిపీఠాల దర్శనంతో సమానమని భక్తుల విశ్వాసం అని పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లో బోనాల జాతర, కళ్యాణోత్సవ పోస్టర్లను మంత్రి కొండా సురేఖ ఆవిష్కరించారు. వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. జులై 21న వైభవంగా ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణోత్సవం జరుగుతుందని మంత్రి కొండా సురేఖ చెప్పారు. జులై 22న సాయంత్రం ఘనంగా రథోత్సవం నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు తరలి వస్తారన్నారు. ఈ నేపథ్యంలో అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమన్వయంతో పనిచేయాలని అధికారులు, సిబ్బందిని మంత్రి ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్ సేవలు, భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు స్పష్టం చేశారు సురేఖ. పోలీసులతో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేయాలని అన్నారు. ట్రాఫిక్ మళ్లింపునకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలనీ సూచించారు. మహిళలు, వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. పరిశుభ్రత, మొబైల్ టాయిలెట్లు, తాగునీటి ఏర్పాట్లు పూర్తిచేయాలని జీహెచ్ఎంసీ అధికారులకు స్పష్టం చేశారు. వైద్య శిబిరాల ఏర్పాటు, 108 అంబులెన్స్‌లతోపాటు అత్యవసర వైద్య బృందాలనూ సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను మంత్రి ఆదేశించారు.

# ఎస్సీ బాలికల హాస్టల్‌లో విద్యార్థిని ఆత్మహత్య

**కామారెడ్డి,జూలై8 :** జిల్లాలోని బాన్సువాడ ఎస్సీ బాలికల హాస్టల్‌లో విద్యార్థిని ఆత్మహత్య కలకలం రేపుతుంది. హాస్టల్ గదిలో ఇంటర్ విద్యార్థిని అమృత ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మద్నూర్ మండలం లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన అమృత హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ బైపీసీ ఫస్ట్ ఇయర్ చదువుతుంది. జ్వరం ఉందని కాలేజీకి వెళ్లకుండా ఉదయం హాస్టల్‌లోనే ఉండిపోయింది. మధ్యాహ్నం వచ్చిన తోటి విద్యార్థినిలు అమృత ఆత్మహత్య విషయాన్ని హాస్టల్ సిబ్బందికి సమాచారం అందజేశారు. దీంతో వారు పోలీసులకు, విద్యార్థిని కుటుంబ సభ్యులకు వివరించారు. కుటుంబ సభ్యులు హాస్టల్‌కు చేరుకుని ఆందోళన నిర్వహించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పశ్చిమాసియాలో మళ్లీ రాజుకున్న అగ్గి

**ఇరాన్, అమెరికాల మధ్య పరస్పర దాడులు**

**అమెరికా దాడులకు ప్రతిగా ఇరాన్ ప్రతిదాడులు**

**బహ్రెయిన్, కువైట్‌లపై దాడులు**



**టెహ్రాన్ :** పశ్చిమాసియాలో మళ్లీ అగ్గి రాజుకుంటోంది. పశ్చిమాసియా మరోసారి నిప్పుల కొలిమిగా మారింది. అమెరికా-ఇరాన్ పరస్పర దాడులతో గల్ఫ్ దేశాల్లో సైరన్ల మోత మోగుతోంది. అగ్రరాజ్య దాడులపై తీవ్రంగా మండిపడ్డ టెహ్రాన్.. ప్రతీకార దాడులు మొదలుపెట్టింది. బహ్రెయిన్, కువైట్‌లో అమెరికాకు చెందిన 85 సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని క్షిపణులు ప్రయోగించింది. హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై దాడులకు ప్రతిస్పందనగా.. ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు, తీరప్రాంత నిఘా వ్యవస్థలపై అమెరికా వైమానిక దాడులు చేసింది. దీనిపై ఐఆర్‌జీసీ తీవ్రంగా స్పందించింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని అగ్రరాజ్యం ఉల్లంఘించిందని ఆరోపించింది. దీనికి తాము కూడా ప్రతీకారం తీర్చుకుంటామని, అందుకే ఈ తాజా ఆపరేషన్ చేపట్టినట్లు వెల్లడించింది. బహ్రెయిన్ లోని యూఎస్ ఫిఫ్త్ ఫ్లీట్, కువైట్‌లోని అలీ అల్ సలేమ్ ఎయిర్ బేస్ సహా అగ్రరాజ్యానికి చెందిన 85 కీలక మిలిటరీ స్థావరాలను టా÷-గ్గ÷ట్ చేసినట్లు పేర్కొంది. వాటిపై క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించినట్లు తెలిపింది. బుషెహర్‌లో అమెరికా అత్యాధునిక డ్రోన్ ఎంక్యూ-9ను కూల్చినట్లు ఐఆర్‌జీసీ వెల్లడించింది. ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు జరుగుతోన్న వేళ ఈ ఉద్రిక్తతలు చోటుచేసుకోవడం గమనార్హం. దీనిపై ఐఆర్‌జీసీ స్పందిస్తూ.. తమ చారిత్రక కార్యక్రమాన్ని మరుగున పడేసేందుకు వాషింగ్టన్ ప్రయత్నిస్తోందని దుయ్యబట్టింది. తాజా దాడులపై ఇరాన్ స్పీకర్ ఘాలిబఫ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. వేధింపులు, బెదిరింపుల శకం ముగిసింది. ఇక మేం తలొగ్గబోం. అమెరికా తీవ్ర ఉల్లంఘనలకు పాల్పడుతోంది. ఆ దేశం ఎంత ఒత్తిడి చేసినా.. టెహ్రాన్ లొంగిపోదని రాసుకొచ్చారు.

ఇరాన్‌పై ఈసారి అతిపెద్ద దాడి జరిపినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. దాదాపు 80కి పైగా లక్ష్యాలపై అత్యంత కచ్చితత్వంతో దాడులు చేసినట్లు తెలిపింది. టెహ్రాన్ కమాండ్, కంట్రోల్ నెట్‌వర్క్‌లు, కోస్టల్ రాడార్ సైట్లు, యాంటీ షిప్ మిసైల్ సామర్థ్యాలు, గగనతల రక్షణ వ్యవస్థలను లక్ష్యంగా చేసుకున్నట్లు పేర్కొంది. ఈ దాడుల్లో ఐఆర్‌జీసీకి చెందిన 60 చిన్న బోట్లు ధ్వంసమైనట్లు వెల్లడించింది. కాగా.. ప్రస్తుతం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నాటో శిఖరాగ్ర సదస్సు కోసం తుర్కియేలో ఉన్నారు. అక్కడి నుంచే ఇరాన్‌పై తాజా దాడులకు ఆయన ఆదేశాలిచ్చినట్లు సమాచారం. మె-ుత్తంగా అమెరికా,ఇరాన్ పరస్పర దాడులతో మళ్లీ ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. ఇరాన్‌పై అమెరికా మరోసారి దాడులు చేసింది. హర్మూజ్ జలసంధిలో మూడు వాణిజ్య నౌకలపై దాడులు జరిగిన గంటల వ్యవధిలోనే ఇరాన్ సైనిక స్థావరాలు, నౌకాశ్రయాల మౌలిక సదుపాయాలపై విరుచుకుపడింది. ఈమేరకు యుఎస్ సెంట్రల్ కమాండ్ ఓ ప్రకటన విడుదల చేసింది. అంతర్జాతీయ జలమార్గంలో అమాయక పౌరులు ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలపై దాడులకు ఇరాన్ మూల్యం చెల్లించుకునేలా.. అమెరికా దళాలు ఈ దాడులు చేపట్టాయని పేర్కొంది. ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు, తీరప్రాంత నిఘా వ్యవస్థలు, క్షిపణి నిల్వలు, డ్రోన్‌ల ప్రయోగ స్థావరాలను తమ సేనలు లక్ష్యంగా చేసుకున్నట్లు ఓ అమెరికా అధికారి తెలిపారు. ఇరాన్ నౌకాశ్రయాల మౌలిక సదుపాయాలపైనా దాడులు చేసినట్లు చెప్పారు. ఖేష్మ్, బందర్ అబ్బాస్‌లలో పేలుళ్ల శబ్దాలు వినిపించినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా తెలిపింది. ఈ దాడులకు ముందే చమురు విక్రయాలకు సంబంధించి ఇరాన్ లైసెన్స్‌ను అమెరికా రద్దు చేసింది. హర్మూజ్‌లో ఇరాన్ చర్యలు ఆమోదయోగ్యం కావని, అందుకే లైసెన్స్‌ను రద్దు చేసినట్లు ఓ అమెరికా అధికారి తెలిపారు. ఈ చర్యను ఇరాన్ విదేశాంగశాఖ తీవ్రంగా ఖండించింది. ఇది తాత్కాలిక ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని పేర్కొంది. దీని పర్యవసానాలకు అమెరికా ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని చెప్పింది. ఇకపోతే బహ్రెయిన్, కువైట్‌పై బుధవారం ఇరాన్ దాడులు చేసింది. బహ్రెయిన్‌లో మిస్సైల్ అలర్ట్ సైరన్ మోగించారు. ఇరాన్‌పై మంగళవారం అమెరికా దాడులు చేసిన నేపథ్యంలో.. కౌంటర్‌గా ఇరాన్ అటాక్ చేసింది. అలర్ట్ సైరన్ మోగిన వెంటనే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని బహ్రెయిన్ ప్రకటన చేసింది. బహ్రెయిన్‌లో కానీ, కువైట్‌లో కానీ డ్యామేజ్ అయినట్లు ప్రస్తుతం ఎటువంటి సమాచారం లేదు. తాజాగా హోర్ముజ్ జలసంధిలో మూడు ఆయిల్ ట్యాంకర్లపై ఇరాన్ దాడి చేసింది. ఆ దాడులకు బదులుగా శక్తివంతమైన రీతిలో అమెరికా ప్రతిదాడి చేసింది. సుమారు 80 టార్గెట్లను ధ్వంసం చేశామని, దీంట్లో ఐఆర్జీసీకి చెందిన 60 బోట్లు ఉన్నట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ పేర్కొన్నది. ఖాసిమ్ దీవి, బందర్ అబ్బాస్, సిరిక్ ప్రాంతాలపై దాడులు జరిగినట్లు ఇరానీ మీడియా తెలిపింది. స్థానిక ప్రజలు గాయపడినట్లు తెలిసింది. అయితే హోర్ముజ్‌లో మూడు ట్యాంకర్లపై దాడికి తామే బాధ్యులమని ఇరాన్ ఇప్పటి వరకు ప్రకటించలేదు.

## పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు

**కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు**

**ఏకంగా 1,677.12 పాయింట్లు పతనం**

**దాదాపు 8.4 లక్షల కోట్ల రూపాయల సంపద ఆవిరి**

**ముంబై :** పశ్చిమాసియాలో మళ్లీ రాజుకున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు దేశీయ స్టాక్ మార్కెట్లను కుదిపేశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో వ్యక్తమైన ఆందోళనల సెగ బుధవారం నాటి ట్రేడింగ్‌లో భారత సూచీలను భారీ నష్టాల్లోకి నెట్టింది. ఉదయం నుంచి ఒడిదుడుకులతో సాగిన మార్కెట్లు, మధ్యాహ్నం తర్వాత ఒక్కసారిగా అమ్మకాల ఒత్తిడికి గురై మరింతగా కుప్పకూలాయి. మార్కెట్ ముగిసే సమయానికి బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ ఏకంగా 1,677.12 పాయింట్లు పతనమై 76,503.60 వద్ద స్థిరపడింది. మరోవైపు, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ-50 సైతం 516.65 పాయింట్లు నష్టపోయి 23,882.05 వద్ద ముగిసింది. ఉదయం సెన్సెక్స్ 77,816.45 పాయింట్ల వద్ద, నిఫ్టీ 24,259.55 పాయింట్ల వద్ద లాభనష్టాల మధ్య సాధారణంగానే ప్రారంభమయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 77,851.18 వద్ద, నిఫ్టీ 24,300.00 వద్ద ఈరోజు గరిష్ఠాలను తాకాయి. అయితే మధ్యాహ్నం 1:00 గంట దాటిన తర్వాత పశ్చిమాసియా నుంచి వచ్చిన ప్రతికూల వార్తలతో మార్కెట్లు నిలువునా కుప్పకూలాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ ఒకానొక దశలో 76,259.03 పాయింట్ల కనిష్ఠానికి, నిఫ్టీ 23,805.20 పాయింట్ల కనిష్ఠానికి పడిపోయి ఇన్వెస్టర్లలో వణుకు పుట్టించాయి. అమెరికా-ఇరాన్ మధ్య దాడులు, ప్రతిదాడుల నేపథ్యంలో పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం నెలకొనడం ప్రపంచవ్యాప్త మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపింది. ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ సరఫరాకు ఆటంకం కలుగుతుందనే భయాలతో చమురు ధరలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఇది భారత్ లాంటి దిగుమతులపై ఆధారపడే దేశాల ఆర్థిక వ్యవస్థలపై ప్రతికూల ప్రభావం చూపుతుందనే ఆందోళన వ్యక్తమైంది.

మార్కెట్లలో అనిశ్చితి నెలకొనడంతో విదేశీ, స్వదేశీ ఇన్వెస్టర్లు రిస్క్ తీసుకోకుండా షేర్లను విక్రయించి నగదును సురక్షితమైన బంగారం వైపు మళ్లించేందుకు మొగ్గు చూపారు. బుధవారం ముగిసిన ట్రేడింగ్‌లో బ్యాంకింగ్, ఐటీ, ఆటోమొబైల్, మెటల్, రియల్ ఎస్టేట్ రంగాల షేర్లు భారీగా నష్టపోయాయి. మార్కెట్లు ఒకే రోజు ఈ స్థాయిలో పతనం కావడంతో ఇన్వెస్టర్ల దాదాపు 8.4 లక్షల కోట్ల రూపాయల సంపద కరిగిపోయింది. సెన్సెక్స్, నిఫ్టీ 2శాతం పైగా పడిపోవడంతో రూ. 8.4 లక్షల కోట్ల నష్టం వాటిల్లి ఇండియా విక్స్ 25 పెరిగిపోయింది. ఒకే సెషన్‌లో పెట్టుబడిదారుల సంపద సుమారు రూ. 8.40 లక్షల కోట్లు క్షీణించింది. గత సెషన్‌లోని రూ. 480.20 లక్షల కోట్ల మార్కెట్ క్యాపిటలైజేషన్, ఈ సెషన్‌లో రూ. 471.80 లక్షల కోట్లకు పడిపోయింది. ఫలితంగా సెషన్ సమయంలో అస్థిరత తీవ్రంగా పెరిగింది. ఇండియా విక్స్ 24.86 శాతం పెరిగి 14.54కు చేరింది. ఇది పెట్టుబడిదారులలో పెరిగిన ఆందోళనను సూచిస్తోంది.

ఇవాళ మార్కెట్ అంతటా కూడా అమ్మకాల ఒత్తిడి కనిపించింది. ఎన్ఎస్ఈలో 2,525 స్టాక్‌లు క్షీణించగా, 694 పురోగమించాయి.

86 స్టాక్‌లు యథాతథంగా ఉన్నాయి. దీంతో, అన్ని ప్రధాన రంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి. నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ 2.72 శాతం, నిఫ్టీ కెమికల్స్ 2.67 శాతం, నిఫ్టీ సిమెంట్ 2.57 శాతం, నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్ 2.52 శాతం, నిఫ్టీ బ్యాంక్ 2.51 శాతం, నిఫ్టీ ఎఫ్ఎంసీజీ 2.49 శాతం, నిఫ్టీ ÷నాన్షియల్ సర్వీసెస్ 2.45 శాతం, నిఫ్టీ మీడియా 2.31 శాతం, నిఫ్టీ ఆటో, నిఫ్టీ ఆయిల్ / గ్యాస్ ఒక్కొక్కటి 2.23 శాతం చొప్పున నష్టపోయాయి. సెన్సెక్స్ స్టాక్‌లలో, ఇండిగో 5 శాతం పడిపోయింది. దాని తర్వాత మారుతి సుజుకి, హిందుస్థాన్ యూనిలివర్, బజాజ్ ÷నాన్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, మహీంద్రా / మహీంద్రా, ఐటీసీ, భారత్ ఎలక్ట్రానిక్స్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, లార్సెన్ / టూబ్రో, అల్ట్రాటెక్ సిమెంట్, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, భారతి ఎయిర్‌టెల్ ఉన్నాయి. అయితే, సెన్సెక్స్‌లో ట్రెంట్ అతి తక్కువగా ప్రభావితమైన స్టాక్‌గా నిలవడం విశేషం. ఇది 0.20 శాతం స్వల్పంగా తగ్గింది.

## నీట్-యూజీ సోషియాలజీ ప్రశ్నాపత్రం లీక్

**ఎక్స్ వేదికగా రాహుల్ ఆరోపణలు**

**న్యూఢిల్లీ :** నీట్-యూజీ పరీక్ష వివాదంపై ఇంకా కొనసాగుతుండగానే యూజీసీ-నెట్ సోషియాలజీ ప్రశ్నపత్రంపై మరోసారి లీక్ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా చేసిన ఆరోపణలు వీటికి మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. యూజీసీ-నెట్ పరీక్షకు ముందు 100 పేజీల పీడీఎఫ్ ఒకటి బయటకు వచ్చిందని రాహుల్ గాంధీ తన ఎక్స్ పోస్టులో రాసుకొచ్చారు. అందులో సుమారు 90 ప్రశ్నల వరకు ఒరిజినల్ సోషియాలజీ క్వశ్చన్ పేపర్‌లోని ప్రశ్నలతో సరిపోలాయన్నారు. ఈ ప్రశ్నపత్రం బిహార్, ఉత్తర్‌ప్రదేశ్, హరియాణా, ఢిల్లీ, రాజస్థాన్‌లో సుమారు రూ.2.25 లక్షలకు అమ్ముడుపోయిందని ఆయన ఆరోపించారు. ఇదే నెట్‌వర్క్ సీఎస్ఐఆర్-నెట్, హెచ్‌టీఈటీ, ఏడీఏ వంటి పరీక్షల ప్రశ్నపత్రాలను కూడా సరఫరా చేస్తోందనీ రాహుల్ పేర్కొన్నారు. గత జూన్ 30న జరిగిన ఈ ప్రశ్నపత్రం పరీక్షకు ముందే లీకైందని వచ్చిన మీడియా కథనాలనూ ప్రస్తావించారు రాహుల్. కాగా.. రోహ్‌తక్(హరియాణా)లో ఇద్దరు విద్యార్థి నాయకులు ఓ వీడియోనూ పోస్ట్ చేస్తూ.. పరీక్షకు ముందే బోధించిన 2 ప్రశ్నపత్రాల సెట్లలో ఒకటి అసలు దానితో సరిపోలుతోందని పేర్కొన్నారు. కాగా.. ఈ పరీక్షకు హాజరైన పలువురు అభ్యర్థులు ప్రశ్నపత్రంలో అనేక అక్షర, వ్యాకరణ దోషాలు సహా క్లారిటీలేని ప్రశ్నలున్నాయనే వ్యాఖ్యలు చేశారు. దీనికి సంబంధించి కొందరు పలు ఉదాహరణలను కూడా సోషల్ మీడియాలో పంచుకున్నారు. ముఖ్యమైన సామాజిక శాస్త్రవేత్తల పేర్లను తప్పుగా ముద్రించడం సహా సంబంధంలేని ప్రశ్నలను అడిగారని వారు పేర్కొన్నారు. మొత్తం 150 ప్రశ్నల్లో కనీసం 67 ప్రశ్నలు గతంలో నిర్వహించిన 2024 పరీక్షలో వచ్చిన వాటితో పోలి ఉన్నాయని, కనీసం బహుళైచ్ఛిక ప్రశ్నల సమాధానాల క్రమమూ మారలేదని ఆరోపించారు. అయితే.. ఈ ఆరోపణలపై జాతీయ పరీక్షల సంస్థ(ఎన్‌టీఏ) నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందనా రాలేదు.

## దేశవ్యాప్తంగా ఎన్ఐఏ భారీగా సోదాలు

**ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ తనిఖీలు**

**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా ఎన్ఐఏ అధికారులు బుధవారం భారీగా సోదాలు చేపట్టారు. ఐసిస్, ఏక్యూఐఎస్ ఉగ్రవాద కార్యకలాపాల ప్రచారంపై సోదాలు చేశారు. భారత్‌లో హింసాత్మక జిహాద్ ద్వారా ఇస్లామిక్ స్టేట్ ఏర్పాటు కుట్రపై దర్యాప్తు ముమ్మరం చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు 10 రాష్ట్రాలు, ఢిల్లీ కేంద్రపాలిత ప్రాంతంలోని మొత్తం 20 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో పలు డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న పరికరాలను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపనున్నట్లు ఎన్ఐఏ అధికారులు తెలిపారు. ఈ కేసులో ఇప్పటివరకు 11 మంది నిందితులు, ఓ బాలుడిని జువెనైల్ నుంచి అదుపులోకి తీసుకున్నామని అధికారులు వెల్లడించారు. విజయవాడ పోలీసులు మార్చిలో నమోదు చేసిన కేసును మేలో ఎన్ఐఏకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ప్రధాన నిందితుడు రెహ్మతుల్లా షరీఫ్ మహ్మద్ నివాసంలో గతంలో ఐసిస్, ఏక్యూఐఎస్‌కు సంబంధించిన అభ్యంతరకర ప్రచార సామగ్రి లభ్యమైంది. గతంలో స్వాధీనం చేసుకున్న డిజిటల్ పరికరాల సాంకేతిక విశ్లేషణ ఆధారంగా ఎన్ఐఏ అధికారులు ఇవాళ సోదాలు నిర్వహించారు. అరెస్టైన నిందితులు దేశంలోని యువతను జిహాదీ భావజాలం వైపు మళ్లించే ప్రయత్నాలు చేసినట్లు అధికారుల దర్యాప్తులో వెల్లడైంది. విదేశీ హ్యాండ్లర్లతో ఆన్‌లైన్ ద్వారా సంబంధాలు కొనసాగిస్తూ ఉగ్ర భావజాలాన్ని వ్యాప్తి చేసినట్లు ఎన్ఐఏ అధికారులు గుర్తించారు. దేశాన్ని అస్థిరపరిచి 'ఖలీఫత్' స్థాపనకు కుట్ర పన్నిన వారిని గుర్తించే దిశగా దర్యాప్తు కొనసాగుతోందని ఎన్ఐఏ అధికారులు పేర్కొన్నారు.

## ఇప్పుడు అయోధ్య.. గతంలో వారణాసి

**దేవుళ్లకే పంగనామాలు పెట్టిన దగుల్బాజీలు**

**హిందువుల విశ్వాసాలను దెబ్బతీసిన దౌర్భాగ్యులు**

**వారణాసి :** ఆలయంలో దోపిడీ అంటే భక్తుల నమ్మకాన్ని, విశ్వాసాన్ని దోచుకోవడమే. ఇటీవల అయోధ్య రామమందిర విరాళాల చోరీ ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అయోధ్య రామాలయంలో విరాళాల దుర్వినియోగం కేసు నేపథ్యంలో, గతంలో జరిగిన కాశీ విశ్వనాథుడి ఆలయ దోపిడీ ఘటన మళ్లీ చర్చనీయాంశమైంది. నాలుగు దశాబ్దాల క్రితం, కాశీ విశ్వనాథ ఆలయంలో జరిగిన ఒక దొంగతనం కారణంగా దాని నిర్వహణను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవలసి వచ్చింది. 1983 జనవరిలో, కాశీ విశ్వనాథ ఆలయ గర్భగుడిలో శివలింగం చుట్టూ ఉన్న 2.6 కిలోల బంగారు ఆభరణాలు, దాదాపు 9 కిలోల వెండి చోరీకి గురయ్యాయి. ఈ చోరీకి పాల్పడిన 11 మందిని అరెస్ట్ చేశారు. అప్పుడు కూడా ఆలయంలో పని చేసే వారి సహాయంతోనే దోపిడీ జరిగినట్టు పోలీసులు వెల్లడించారు. ఘటన అనంతరం కాశీ విశ్వనాథ ఆలయ భద్రత, ఆర్థిక నిర్వహణలో లోపాలపై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకొచ్చింది. ఆలయ నిర్వహణను ప్రభుత్వం ఏర్పాటు చేసిన ట్రస్ట్ బోర్డు ఆధీనంలోకి తీసుకువచ్చింది. అప్పటి నుంచి భద్రతా వ్యవస్థలు, విరాళాల లెక్కింపు, పరిపాలనలో పలు సంస్కరణలు అమల్లోకి వచ్చాయి. అయోధ్య రామమందిర విషయంలో కూడా ప్రభుత్వం నూతన సంస్కరణలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. కాగా, రామ మందిర ఆలయ ట్రస్టుకు జవాబుదారీగా ఉండే సీఈవో నియామకానికి తాము అంగీకరిస్తామని, అయితే ప్రభుత్వ స్వాధీనాన్ని మాత్రం అనుమతించబోమని వీహెచ్‌పీ తెలిపింది. శ్రీ రామ్ జన్మభూమి ఆలయాన్ని ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకువచ్చే ఏ ప్రయత్నాన్నైనా తాము వ్యతిరేకిస్తామని వీహెచ్‌పీ పేర్కొంది.

## ఇండోనేషియాలో ప్రధాని నోట కుచ్ కుచ్ హోతా హై

**కృతజ్ఞతలు తెలిపిన దర్శకుడు కరణ్ జోహార్**

**ముంబై :** భారత ప్రధాని నరేంద్ర మోదీ ఇండోనేషియా పర్యటనలో చేసిన కామెంట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. జకార్తాలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ మోదీ.. బాలీవుడ్ సూపర్ హిట్ చిత్రం 'కుచ్ కుచ్ హోతా హై' లోని టైటిల్ సాంగ్‌ను ప్రస్తావిస్తూ భారత్-ఇండోనేషియా సంబంధాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. దీనిపై ఆ చిత్ర దర్శకుడు కరణ్ జోహార్ ఆనందం వ్యక్తం చేస్తూ ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు. ఇండోనేషియాలో భారతీయ సంస్కృతికి మంచి ఆదరణ ఉందని పేర్కొన్న ప్రధాని మోదీ.. అక్కడ 'కుచ్ కుచ్ హోతా హై' పాట ఎంతో ప్రాచుర్యం పొందిందని చెప్పారు. ఇండోనేషియాలో భారతదేశానికి చెందిన 'కుచ్ కుచ్ హోతా హై' పాట చాలా ప్రాచుర్యం పొందింది. భారత్, ఇండోనేషియా కలిసి ముందుకు సాగినప్పుడు మన ప్రయాణం కేవలం 'కుచ్ కుచ్' దగ్గరే ఆగిపోకుండా 'బహుత్ కుచ్' సాధించే దిశగా సాగాలి' అని వ్యాఖ్యానించారు.మోదీ చేసిన ఈ చమత్కార వ్యాఖ్యలకు సభలో చప్పట్లతో స్వాగతం లభించింది. ప్రధాని మోదీ తన సినిమాను ప్రస్తావించడంపై ప్రముఖ దర్శకుడు, నిర్మాత కరణ్ జోహార్ సోషల్ మీడియా ద్వారా స్పందించారు. జకార్తాలో మన గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'కుచ్ కుచ్ హోతా హై' సినిమా గురించి మాట్లాడటం ఎంతో ఆనందంగా, గర్వంగా అనిపించింది. ప్రేమకు సరిహద్దులు లేవని, అది అందరికీ అర్థమయ్యే భాష అని ఈ సందర్భం మరోసారి నిరూపించింది. మా సినిమాను, ఆ పాటను గుర్తుచేసినందుకు ధన్యవాదాలు అని ఆయన పేర్కొన్నారు.

## మహారాష్ట్రలో ఎడతెరిపిలేని వర్షాలు

**ముంబై :** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు మహారాష్ట్రను అతలాకుతలం చేస్తున్నాయి. పలు జిల్లాల్లో కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఇదే సమయంలో పుణెలిలో కూడా భారీ వర్షాల కారణంగా ఓ మూడంతస్తుల భవనం కుప్పకూలి తీవ్ర కలకలం రేపింది. మోషి ప్రాంతంలోని పింప్రి-చించ్వాడ్ మున్సిపల్ కార్పొరేషన్ వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్‌లోని మూడు అంతస్తుల కార్యాలయ భవనం ఒక్కసారిగా నేలమట్టమైంది. అధికారుల సమాచారం ప్రకారం, భవనం కూలిన సమయంలో అందులో ఉన్న 15 నుంచి 16 మంది కార్మికులు శిథిలాల కింద చిక్కుకుని ఉండే అవకాశం ఉంది. మధ్యాహ్నం సుమారు 1.45 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఘటనపై వెంటనే సమాచారం అందుకున్న పీసీఎంసీ అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. గాలింపు, సహాయక చర్యల కోసం ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను కూడా రంగంలోకి దించారు.

## ప్రతి ఒక్కరూ ఓటు వివరాలు నమోదు చేయాలి

**శాసనసభ్యులు వేముల ప్రశాంత్ రెడ్డి పిలుపు**

**నిజామాబాద్ :** బాల్కొండ నియోజకవర్గ పరిధిలోని ప్రతి ఒక్కరూ తమ ఓటరు వివరాలను విధిగా నమోదు చేసుకోవాలని మాజీ మంత్రి,శాసనసభ్యులు వేముల ప్రశాంత్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం తన స్వగ్రామమైన వేల్పూర్‌లో తహసీల్దార్ సమక్షంలో బూత్ లెవల్ అధికారులకు తన వ్యక్తిగత ఓటరు వివరాలను ఆయన స్వయంగా అందజేశారు. ఒక ఫారాన్ని అధికారులకు సమర్పించి, రసీదుగా మరో ఫారాన్ని తన వద్ద ఉంచుకున్నారు. నియోజకవర్గ ప్రజలందరు భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా అధికారులకు, బీఎల్‌వో, బీఎల్ఏలకు కీలక సూచనలు చేశారు. బీఎల్‌ఓలు గ్రామ పంచాయతీ కార్యాలయాలు, గుడులు , సంఘం భవనాల్లో ఒకే దగ్గర కూర్చుని వివరాలు రాయడం సరికాదన్నారు. ఇంటింటికీ స్వయంగా వెళ్లి ఓటర్లను కలిసి వివరాలు సేకరించాలని తెలిపారు. బీఎల్‌ఓలు ఒకే దగ్గర కూర్చుని పనిచేస్తే ప్రజల ఓట్లు గల్లంతయ్యే అవకాశం ఉందని, ఈ విషయంలో బాధ్యతాయుతం గా వ్యవహరించాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి, ఓటర్లను ప్రత్యక్షంగా చూసి వివరాలు సేకరించిన తర్వాతే ఆఫీసులో ఆన్‌లైన్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేల్పూర్ తహసీల్దార్ అనిరుద్ , సర్పంచ్ అశోక్, ప్రతాప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అమెరికాలో భార్యను చంపిన తెలంగాణ వాసి

**ప్రేయసి కోసం భార్యను హతమార్చి నాటకాలు**

**పోలీసుల దర్యాప్తులో హతీ÷-య చేసినట్లు అంగీకారం**


**వాషింగ్టన్,జూలై8 :** భార్యను చంపి, గుర్తు తెలియన వారు చేసిన హత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నించిన తెలంగాణ యువకుడిని అమెరికా పోలీసులు అరెస్టు చేశారు. ఇండియాలో ఉన్న తన ప్రేయసి కోసం ఆ యువకుడు తన భార్యను చంపినట్లు తేలింది. దీంతో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. తెలంగాణకు చెందిన నార్నె అవినాష్ (30) అనే యువకుడికి, రాజిత సబ్బినేని (27) అనే యువతికి గత ఏడాది వివాహమైంది. నార్నె అవినాష్ అమెరికాలోని వాషింగ్టన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. నూతన దంపతులిద్దరూ అక్కడే ఉంటున్నారు. ఈ క్రమంలో వీరి పెళ్లైన ఆరు నెలలలకు.. అంటే గత ఏడాది అక్టోబర్ చివరిలో రాజిత అనుమానాస్పదంగా మరణించింది. తన భార్య బాత్‌రూమ్‌లోకి వెళ్లి తలుపు వేసుకుందని, పిలిచినా పలకడం లేదని అవినాష్ పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే వచ్చి చూడగా, బాత్‌రూమ్ తలుపు వేసి ఉంది. తలుపు పగలగొట్టి చూడగా, రాజిత అక్కడి నేలపై పడిపోయి ఉంది. రాజితను పరీక్షించిన పోలీసులు అప్పటికే ఆమె మరణించినట్లు గుర్తించారు. దీంతో ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ జరగగా.. అవినాష్ పొంతనలేని సమాధానాలు చెప్పాడు. తను బయటకు వెళ్లొచ్చేసరికి ఆమె బాత్‌రూమ్‌లో లాక్ చేసుకుని ఉందని, వెంటనే పోలీసులకు తెలిపానని విచారణలో చెప్పాడు. కానీ, తన వాదనలో ఎక్కడో తేడా కొట్టడంతో వాషింగ్టన్ పోలీసులు, డిటెక్టివ్స్ అన్ని కోణాల్లో విచారణ జరిపారు. అతడు చెప్పిన సమాధానాలకు, ఘటన జరిగిన విధానాలకు తేడా ఉంది. అలాగే, రాజిత ఊపిరాడకపోవడం వల్ల మరణించిందని, తనను ఎవరో హత్య చేశారని పోస్టుమార్టంలో తేలింది. దీంతో హత్య కోణంలో పోలీసులు విచారించారు. సీసీ కెమెరాల్లో అతడు తప్ప ఆ ఇంట్లోకి ఎవరూ రానట్లు గుర్తించారు. వారిద్దరి ఫోన్‌లను కూడా పరిశీలించారు. ఇలా, పలు రకాలుగా పరిశీలించగా, అవినాష్‌ను విచారించగా.. చివరకు అతడే రాజితను హత్య చేసినట్లు అంగీకరించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అవినాష్ పెళ్లికి ముందే ఇండియాలో ఒక యువతిని ప్రేమించాడు. అయినప్పటికీ, రాజితను పెళ్లి చేసుకున్నాడు. పైగా ఆ యువతి కూడా వీరి పెళ్లికి వచ్చింది. పెళ్లి అనంతరం అమెరికా వెళ్లినా సరే.. అతడు ఆ ప్రేయసితో సంబంధాన్ని కొనసాగించాడు. ఆమె కోసమే ఈ హత్య చేసినట్లు తేలింది. రాజితను హత్య చేసిన తర్వాత ఆమె మృతదేహానికి సంబంధించిన ఫొటోను అతడు ఇండియాలోని తన ప్రేయసికి పంపాడు. ఈ విషయాలన్నీ పోలీసులు ఇటీవల కోర్టుకు నివేదించారు. రాజిత హత్య జరిగిన దాదాపు 9 నెలల తర్వాత అతడి నేరం రుజువైంది. కొంతకాలం బెయిల్‌పై ఉన్న అతడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఈ కేసు విచారణ కొనసాగుతోంది. కోర్టు అతడికి అక్కడి చట్టాల ప్రకారం.. యావజ్జీవ కారాగార శిక్ష విధించే అవకాశం ఉంది.



# చీరలో అనసూయ స్టన్నింగ్ లుక్..

## సోషల్ మీడియా ట్రెండింగ్ లో కొత్త పిక్స్!

బుల్లితెరపైనే కాదు, వెండితెరపై కూడా తనదైన ముద్ర వేసిన నటి, యాంకర్ అనసూయ భరద్వాజ్ మరో అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. హైదరాబాద్‌లో జరిగిన ప్రతిష్టాత్మక ుజుణఇ ఈవెంట్‌లో ఆమె స్పీకర్‌గా పాల్గొని అదరగొట్టింది. ఈ ఈవెంట్ కోసం అనసూయ ఎర్రటి చీర లోని ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ ట్రెండ్ అవుతున్నాయి. సాంప్రదాయానికి కాస్త మోడ్రన్ టచ్ ఇస్తూ ఆమె చేసిన సరికొత్త ప్రయోగం నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటోంది. లైఫ్‌లో ఎన్నో ఆటంకాలను ఎదుర్కొని నిలబడిన అనసూయ, ుజుణఇ×మీ హైదరాబాద్ వేదికపై తన జీవిత అనుభవాలు, కెరీర్ ప్రయాణం గురించి పవర్‌ఫుల్ స్పీచ్ ఇచ్చింది. తన కల నిజమైన సంతోషంలో "నా మొదటి ుజుణఇ టాక్.. అచీవ్‌మెంట్ అన్‌లాక్డ్" అంటూ ఇన్ స్టాలో ఎమోషనల్ పోస్ట్ పెట్టింది. ఆ ఐకానిక్ రెడ్ సర్కిల్‌పై నిలబడి మాట్లాడటం తన లైఫ్‌లో ఒక బ్యూటిఫుల్ రిమైండర్ అని, ఈ ఈవెంట్ తర్వాత మరికొన్ని భయాలను, అలాగే మరికొన్ని కిలోల బరువును కూడా తగ్గించుకున్నానని సరదాగా చెప్పుకొచ్చింది. ఈ ఈవెంట్ కోసం అనసూయ ఎంచుకున్న అవుట్‌ఫిట్ అందరినీ కట్టిపడేసింది. ఆమె మంచి ఎరుపు రంగు హ్యాండ్లూమ్ చీరను ధరించింది. పల్లూ భాగంలో అడ్డంగా వచ్చిన డిజైన్ లైన్స్ ఈ చీరకు ఒక ప్రత్యేకమైన లుక్‌ను తీసుకొచ్చాయి. ఇక దీనికి కాంబినేషన్‌గా అదే డీప్ రెడ్ కలర్ గల స్లీవ్‌లెస్ బ్లౌజ్‌ను మ్యాచ్ చేసింది. ఈ డ్రెస్సింగ్‌లో అనసూయ ఎంతో క్లాసిగా, రాయల్‌గా మెరిసిపోయింది.




# టాక్సిక్ నుంచి తబాహీ వీడియో సాంగ్ విడుదల

యశ్ హీరోగా గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో రానున్న చిత్రం 'టాక్సిక్' ఆగస్టు 26న విడుదల కానుండడంతో చిత్రబృందం ప్రచారం జోరు పెంచింది. ఈ చిత్రంలో యశ్‌కు జోడీగా ఐదుగురు హీరోయిన్‌లు నటించిన విషయం తెలిసిందే. వీరిలో నదియా పాత్రలో కియారా అద్వాణీ కనిపించనున్నారు. యశ్ - కియారా మధ్య వచ్చే 'తబాహీ' వీడియో సాంగ్‌ను తాజాగా విడుదల చేశారు. గతంలో ఈ పాట పోస్టర్‌తో చిత్రబృందం ఆడియో విడుదల చేసింది. కొన్ని రోజులకే పాట, పోస్టర్‌పై విమర్శలు వచ్చాయి. కియారా కూడా ఈ పాటలోని బోల్డ్ సీన్స్ తగ్గించాలని రిక్వెస్ట్ చేశారంటూ వార్తలు వచ్చాయి. వీటిని ఆమె కొట్టిపారేసినప్పటికీ పాట మాత్రం హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా ఈ పాట పూర్తి వీడియోను టీమ్ పంచుకుంది. ఇప్పటి వరకూ 'టాక్సిక్' నుంచి వచ్చిన అన్ని వీడియోల్లాగే ఇందులోనూ శృంగార సన్నివేశాలు ఉండడం మరోసారి చర్చకు దారితీస్తోంది. ఇక భారీ స్థాయిలో రానున్న ఈ చిత్రంలో హై-ఇంపాక్ట్ యాక్షన్ అవతార్‌లో యశ్ కనిపించనుండగా.. మునుపెన్నడూ చూడని పవర్‌ఫుల్ పాత్రల్లో అందాల భామలు నయనతార, రుక్మిణి వసంత్, తారా సుతారియా, హ్యూమా ఖురేషీ ఆకట్టుకుంటున్నారు.

# సుకుమార్ స్కూల్ నుంచి మరో దర్శకుడు

## బాబీ దర్శకత్వంలో సిద్దూ జొన్నలగడ్డ



టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ సుకుమార్ కేవలం విజయవంతమైన సినిమాలు తెరకెక్కించడమే కాకుండా, ఇండస్ట్రీకి పలువురు ప్రతిభావంతులైన దర్శకులను అందించిన గురువుగా కూడా ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన వద్ద శిష్యరికం చేసిన అనేక మంది దర్శకులు ప్రస్తుతం టాలీవుడ్‌లో తమకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. తాజాగా ఆ జాబితాలోకి మరో కొత్త దర్శకుడు చేరనున్నట్లు సినీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. తాజా సమాచారం ప్రకారం.. సుకుమార్ సోదరుడి కుమారుడు బాబీ త్వరలో దర్శకుడిగా పరిచయం కానున్నారు. గత కొంతకాలంగా సుకుమార్ వద్ద అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేసిన బాబీ.. ఆయన సినిమాలతో పాటు పలు ప్రాజెక్ట్‌లలో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఇప్పుడు పూర్తి స్థాయి దర్శకుడిగా తన తొలి చిత్రాన్ని తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. బాబీ దర్శకత్వంలో రూపొందనున్న తొలి చిత్రంలో యువ హీరో సిద్దు జొన్నలగడ్డ నటించే అవకాశాలు ఉన్నట్లు టాలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే కథను సిద్ధుకు వినిపించగా, ఆయనకు నచ్చడంతో ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ, సుకుమార్ క్యాంప్ నుంచి వస్తున్న ప్రాజెక్ట్ కావడం, కథ కూడా నచ్చడంతో సిద్ధు ఈ సినిమాకు అంగీకరించినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు సుకుమార్ వద్ద పనిచేసిన శిష్యుల తొలి చిత్రాలు ఎక్కువగా సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌లోనే రూపొందాయి. అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ బాబీ తొలి సినిమాను కూడా సుకుమార్ నిర్మించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

# రాకాను వదులుకున్న ప్రీతి ముకుందన్



అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'రాకా'. భారీ ప్రాజెక్ట్‌గా సిద్ధమవుతోన్న ఈ చిత్రంలో నటించే అవకాశాన్ని ప్రీతి ముకుందన్ వదులుకున్నట్లు గతంలో వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా ఈ విషయంపై అట్లీ స్పందించారు. 'హృదయం మురళి' సినిమా ట్రైలర్ ఈవెంట్‌లో ఆయన మాట్లాడారు. నేను ప్రీతి నటనకు పెద్ద అభిమానిని. నా డ్రీమ్ ప్రాజెక్ట్ 'రాకా'లో ఒక కీలక పాత్ర కోసం మొదట ఆమెనే సంప్రదించాను. అప్పటికే ఆమె బిజీగా ఉండటంతో మాకు డేట్స్ కేటాయించలేక పోయింది. దీంతో ఈ ప్రాజెక్టును ఆమె వదులుకోవాల్సి వచ్చిందని చెప్పారు. ప్రీతి రిజెక్ట్ చేసిన ఈ కీలక పాత్రను మలయాళ నటి ఫెమినా జార్జ్‌కు ఆఫర్ చేసినట్లు అట్లీ స్పష్టం చేశారు. ఆ పాత్రకు సంబంధించిన వివరాలను మాత్రం ప్రస్తుతానికి సస్పెన్స్‌గా ఉంచారు. 'కన్నప్ప'తో ఇండస్ట్రీకి పరిచయమైన ప్రీతి ముకుందన్ ఇటీవల 'బ్లాస్ట్'తో ప్రేక్షకులను అలరించారు. ఇప్పుడు తమిళ రొమాంటిక్ కామెడీ 'హృదయం మురళి'తో పలకరించేందుకు సిద్ధమయ్యారు. జులై 10న విడుదల కానుంది.

# ఎమోషనల్ రొమాంటిక్ డ్రామా.. హృదయ మురళి



కోలీవుడ్ యంగ్ హీరో అథర్వ మురళి, మలయాళ స్టార్ యాక్టర్ ఫహద్ ఫాజిల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'హృదయం మురళి' . ఆకాష్ భాస్కరన్ దర్శకత్వంలో యూత్ ఫుల్ ఎమోషనల్ అండ్ రొమాంటిక్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా ట్రైలర్ తాజాగా విడుదలైంది. ఒక యువకుడి జీవితంలో ఎదురయ్యే వన్–సైడెడ్ లవ్, భావోద్వేగాల చుట్టూ ఈ కథ తిరుగుతుందని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. జీవితం ముందుకు సాగుతున్నా కొన్ని జ్ఞాపకాలు, భావాలు ఎప్పటికీ చెరిగిపోవనే పాయింట్ తో ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు. ఈ చిత్రంలో ప్రీతి ముకుందన్, కాయదు లోహర్ కథానాయికలుగా నటిస్తుండగా, స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ థమన్ ఎస్ దాదాపు 22 ఏళ్ల తర్వాత మళ్లీ నటుడిగా కనిపసించడం విశేషం. అంతేకాకుండా ఈ సినిమాకు థమన్ అద్భుతమైన సంగీతాన్ని అందించారు. డాన్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మితమైన ఈ చిత్రంలో ఫహద్ ఫాజిల్ ఒక పవర్‌ఫుల్ క్యామియో రోల్‌లో కనిపించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను తెలుగులో అందిస్తుండగా, జూలై 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రస్తుతం విడుదలైన ఈ ట్రైలర్ యూత్‌ను విపరీతంగా ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది.

# శాసనసభ కీలక కమిటీల్లో డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు చోటు

## మూడు ముఖ్య కమిటీల్లో సభ్యునిగా నియామకం



జనతా న్యూస్ । హైదరాబాద్ । జూలై 8 తెలంగాణ శాసనసభకు సంబంధించిన పలు కీలక కమిటీల్లో మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు స్థానం లభించింది. శాసనసభ స్పీకర్ ఆదేశాల మేరకు వివిధ కమిటీలను పునర్వ్యవస్థీకరించగా, డాక్టర్ కవ్వంపల్లిని మూడు ముఖ్య కమిటీల్లో సభ్యునిగా నియమించారు. ప్రభుత్వం రూపొందించే నిబంధనలు, ఉప చట్టాలు రాజ్యాంగబద్ధంగా ఉన్నాయా, ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా ఉన్నాయా అనే అంశాలను పరిశీలించే సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ సభ్యునిగా ఆయన నియమితులయ్యారు. అలాగే ఎస్సీ సంక్షేమ పథకాల అమలు, నిధుల వినియోగం, సమస్యలపై అధ్యయనం చేసి శాసనసభకు నివేదిక సమర్పించే షెడ్యూల్డ్ కులాల సంక్షేమ కమిటీ సభ్యునిగా కూడా ఆయనకు అవకాశం కల్పించారు. ప్రస్తుతం టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్‌గా పనిచేస్తున్న అనుభవం ఈ కమిటీ పనితీరుకు మరింత ఉపయోగపడుతుందని పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. రాష్ట్రంలో ద్వేషపూరిత ప్రసంగాలు, సామాజిక సామరస్యానికి భంగం కలిగించే చర్యలను అరికట్టేందుకు రూపొందిస్తున్న ద్వేషపూరిత ప్రసంగాలు, ద్వేష నేరాల నిరోధక బిల్లు--2026పై అధ్యయనం చేసి సూచనలు అందించే సెలెక్ట్ కమిటీలోనూ డాక్టర్ కవ్వంపల్లికి చోటు దక్కింది. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి కీలక కమిటీల్లో అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తమ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మూడు కమిటీల బాధ్యతలను నిజాయితీగా నిర్వహిస్తానని చెప్పారు. ముఖ్యంగా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ కమిటీ ద్వారా మానకొండూర్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ వర్గాల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తానని పేర్కొన్నారు. డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు శాసనసభ కీలక కమిటీల్లో స్థానం లభించడంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మానకొండూర్ నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# సీజనల్ వ్యాధుల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

## పరిశుభ్రతతోనే డెంగ్యూ, చికున్‌గున్యా, మలేరియాకు అడ్డుకట్ట: జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



జనతా న్యూస్ । జగిత్యాల । జూలై 8 వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి క్షేత్రస్థాయిలో సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం జగిత్యాల మున్సిపల్ పరిధిలోని 8వ వార్డును సందర్శించిన కలెక్టర్ పారిశుద్ధ్య నిర్వహణ, డ్రై డే కార్యక్రమాలు, యాంటీ లార్వా చర్యలు, ఫీవర్ సర్వేలు, దోమల నివారణ చర్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆశా కార్యకర్తలు, ఆరోగ్య శాఖ, మున్సిపల్ సిబ్బందితో మాట్లాడి చేపడుతున్న చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డెంగ్యూ, చికున్‌గున్యా, మలేరియా వంటి సీజనల్ వ్యాధులను అదుపులోకి తీసుకురావాలంటే ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేయడం అత్యవసరమన్నారు. ఇళ్లలో పాత టైర్లు, కూలర్లు, పూల కుండీలు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, నీరు నిల్వ ఉండే పాత్రలను వెంటనే తొలగించాలని సూచించారు. దోమల లార్వా పెరిగే ప్రాంతాల్లో యాంటీ లార్వా మందులు, ఆయిల్ బాల్స్ వినియోగించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రోజు డ్రై డే కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఫీవర్ సర్వేలను నిరంతరం కొనసాగించాలని, జ్వర లక్షణాలు ఉన్న వారిని వెంటనే వైద్య పరీక్షలకు పంపించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులనే నివేదికలుగా సమర్పించాలని, తప్పుడు సమాచారం ఇవ్వకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులకు స్పష్టం చేశారు. "మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం -- సీజనల్ వ్యాధులను దూరం చేద్దాం" అనే సందేశాన్ని ప్రతి ఇంటికి చేరేలా విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. చెత్త సేకరణ వాహనాలు, మైకింగ్ ద్వారా ప్రజల్లో అవగాహన పెంచాలని ఆదేశించారు. వీధి ఆహార విక్రేతలు పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, పరీక్షా కిట్లు, వైద్య సామగ్రి తగినంత అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, డిప్యూటీ జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి శ్రీనివాస్, జైపాల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లను వంద శాతం భూమిపూజ దశకు తీసుకురావాలి

## ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్




జనతా న్యూస్ । జగిత్యాల । జూలై 8 జిల్లాలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను వంద శాతం భూమిపూజ (గ్రౌండింగ్) దశకు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి క్లస్టర్ అధికారి తన పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ భూమిపూజ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. నిర్మాణ పనులు ప్రారంభించి వీలైనంత త్వరగా పునాది దశ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్మాణం పూర్తయిన ఇళ్లలో గృహప్రవేశాలు త్వరగా నిర్వహించి, తుది దశ భౌగోళిక గుర్తింపు నమోదును (జియో ట్యాగింగ్) లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని సూచించారు. ప్రధాన కార్యాలయం నుంచి అందిన గుడిసె నివాసితుల జాబితా ఆధారంగా ఇంటింటి సర్వేను త్వరితగతిన పూర్తి చేసి, అర్హుల వివరాలను కలెక్టర్ లాగిన్‌కు పంపించాలని అధికారులను ఆదేశించారు. ఇల్లు నిర్మాణం ప్రారంభించని లేదా నిర్మించేందుకు ఆసక్తి లేని లబ్ధిదారుల ప్రతిపాదనలను వెంటనే రద్దు కోసం పంపించాలని తెలిపారు. అలాగే రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియకు సంబంధించిన ప్రతిపాదనలను పూర్తి చేసి, అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి జాప్యం లేకుండా ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీవోలు, ఇతర సంబంధిత అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని, నిర్మాణ పురోగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపులు ఆలస్యం కాకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. జిల్లాలో మొత్తం 10,860 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, 9,058 ఇళ్లకు మార్కింగ్ పూర్తయిందని, 1,215 ఇళ్లు పునాది దశలో, 748 ఇళ్లు గోడల దశలో, 4,233 ఇళ్లు స్లాబ్ దశలో ఉండగా, 1,746 ఇళ్ల నిర్మాణం పూర్తయిందని అధికారులు సమావేశంలో వివరించారు. ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజగౌడ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రఘువరన్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, గృహ నిర్మాణ శాఖ డీఈ భాస్కర్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, క్లస్టర్ ఇన్‌చార్జీలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లిన అర్జెంటీనా!



2026 ఫీఫా ప్రపంచ కప్ క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లేందుకు అర్జెంటీనా, ఈజిప్ట్‌ను 3-2 తేడాతో ఓడించింది. చివరి నిమిషాల్లో అర్జెంటీనా మ్యాచ్‌ను తమ వైపు తిప్పుకుంది. లియోనెల్ మెస్సీ, ఇతర అర్జెంటీనా ఆటగాళ్లు చివరి నిమిషాల్లో అద్భుతంగా ఆడారు. మహమ్మద్ సలాహ్ సారథ్యంలోని ఈజిప్ట్ జట్టు అర్జెంటీనా అభిమానులను ఉత్కంఠకు గురిచేసినా, సూపర్ 8లోకి వెళ్లడంలో విఫలమైంది. అర్జెంటీనా చివరిసారిగా 2018లో క్వార్టర్ ఫైనల్‌లో ఓడిపోయింది. 2026 ప్రపంచ కప్‌లో కూడా ఈజిప్ట్ మెస్సీ జట్టును ఓడించింది, కానీ లియోనెల్ మెస్సీ, క్రిస్టియన్ రొమెరో, ఎంజో ఫెర్నాండెజ్ అర్జెంటీనాను గెలిపించడంలో సహాయపడ్డారు. మ్యాచ్‌లో ఈజిప్ట్ తరఫున తొలి గోల్ 15వ నిమిషంలో యాసర్ ఇబ్రహీం చేసి జట్టుకు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. 67వ నిమిషంలో ముస్తఫా జికో రెండో గోల్ చేసి ఈజిప్ట్‌కు 2-0 ఆధిక్యాన్ని అందించాడు. 78వ నిమిషం వరకు ఈజిప్ట్ 2-0 ఆధిక్యంలోనే కొనసాగింది. ప్రపంచ కప్ వంటి అధిక ఒత్తిడి గల మ్యాచ్‌లలో గోల్స్ చేయడం కష్టం, కానీ 79వ నిమిషంలో క్రిస్టియన్ రొమెరో గోల్ చేయడంతో అర్జెంటీనా ఆశలు మళ్లీ చిగురించాయి. కేవలం నాలుగు నిమిషాల తర్వాత, లియోనెల్ మెస్సీ తన 21వ ప్రపంచ కప్ గోల్‌ను సాధించాడు. అయితే, అదే మ్యాచ్‌లో 19వ నిమిషంలో మెస్సీ పెనాల్టీని కోల్పోయాడు. ఆ క్షణంలో అక్కడి వాతావరణం ఎంతలా ఉందంటే, మొత్తం మైదానం నిశ్శబ్దంగా ఉండిపోయింది. మ్యాచ్ సమయం ముగిసే వరకు మ్యాచ్ 2-2తో సమంగానే కొనసాగింది. అదనపు సమయం తర్వాత, 93వ నిమిషంలో ఎంజో ఫెర్నాండెజ్ అర్జెంటీనా తరఫున మ్యాచ్‌లో మూడో, నిర్ణయాత్మక గోల్‌ను సాధించాడు. అర్జెంటీనా డిఫెండింగ్ ఛాంపియన్‌గా ఫీఫా ప్రపంచ కప్ 2026లోకి అడుగుపెడుతోంది. మెస్సీ జట్టు ఇప్పుడు వరుసగా రెండో టైటిల్, మొత్తంగా నాలుగో టైటిల్‌ను కైవసం చేసుకోవడానికి కేవలం మూడు విజయాల దూరంలో ఉంది. క్వార్టర్ ఫైనల్స్‌కు చేరిన ఏడో జట్టుగా అర్జెంటీనా నిలిచింది. అంతకుముందు, ఫ్రాన్స్, మొరాకో, స్పెయిన్, బెల్జియం, ఇంగ్లాండ్, నార్వే ఇప్పటికే చివరి ఎనిమిది జట్లలో తమ స్థానాలను సురక్షితం చేసుకున్నాయి. క్వార్టర్ ఫైనల్స్‌లో అర్జెంటీనా ఇప్పుడు స్విట్జర్లాండ్, కొలంబియా మధ్య జరిగే రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్ విజేతతో తలపడుతుంది. ఈ మ్యాచ్ సందర్భంగా, లియోనెల్ మెస్సీ ఒక తప్పు చేశాడు. నిజానికి, అంత కీలకమైన మ్యాచ్‌లో మెస్సీ పెనాల్టీని గోల్‌గా మార్చడంలో విఫలమయ్యాడు. 15వ నిమిషంలో ఈజిప్ట్ 1-0 ఆధిక్యం సాధించగా, 19వ నిమిషంలో అర్జెంటీనాకు పెనాల్టీ లభించింది. అయితే, మెస్సీ ఆ పెనాల్టీని మిస్ చేశాడు. ఆస్ట్రియాతో జరిగిన మ్యాచ్‌లో కూడా మెస్సీ ఒక పెనాల్టీని మిస్ అయ్యాడు. ఈజిప్ట్‌తో జరిగిన మ్యాచ్‌లో కూడా అదే జరిగినప్పుడు, స్టేడియం మొత్తం నిశ్శబ్దమైపోయింది. ప్రతి ఒక్కరూ, "ఓరి దేవుడా, మెస్సీ! నువ్వేం చేశావు?" అని ఆశ్చర్యపోయారు. ఆరు ప్రపంచ కప్ టోర్నమెంట్లలో మెస్సీ పెనాల్టీని గోల్‌గా మార్చడంలో విఫలమవడం ఇది నాలుగోసారి. లియోనెల్ మెస్సీ 2006లో తన ప్రపంచ కప్ అరంగేట్రం చేసాడు. అతను 2026లో తన ఆరో ప్రపంచ కప్‌లో ఆడుతున్నాడు. గత 20 ఏళ్లలో మెస్సీ పెనాల్టీని స్కోర్ చేయడంలో విఫలమవడం ఇది నాలుగవసారి. అతను ఆరు ప్రపంచ కప్‌లలో నాలుగు పెనాల్టీలను మిస్ అయ్యాడు. ప్రపంచ కప్‌లలో అత్యధిక గోల్స్ చేసిన రికార్డు మెస్సీ పేరిట ఉన్నప్పటికీ, నాలుగు పెనాల్టీలను మిస్ అయిన రికార్డు అతని కెరీర్‌పై చెరగని మచ్చగా కూడా గుర్తుండిపోతుంది.

# తిలక్ వర్మపై బీసీసీఐ వేటు?



భారత క్రికెట్లో ప్రస్తుతం ఒక పెద్ద కుదుపు చోటుచేసుకుంది. కొన్నాళ్ల క్రితమే ఘనంగా టీ20 వరల్డ్ కప్ గెలిచిన టీమిండియా.. ఇప్పుడు అదే ఫార్మాట్‌లో చాలా బలహీనంగా కనిపిస్తోంది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఐర్లాండ్ చేతిలో ఫస్ట్ టైం టీ20 సిరీస్‌ను కోల్పోయిన భారత్, ఇప్పుడు ఇంగ్లండ్‌తో జరుగుతున్న సిరీస్‌లోనూ ఆశలను వదిలేసుకుంది. దీంతో కొత్త కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్లతో పాటు జట్టులోని పలువురు ఆటగాళు విమర్శల పాలవుతున్నారు. ఇప్పటికే సంజూ శాంసన్‌ను జట్టు నుంచి తొలగించగా, ఇప్పుడు అందరి దృష్టి వైస్ కెప్టెన్ అయిన తిలక్ వర్మపై పడింది. అతని పేలవ ఫాం చూస్తుంటే.. గతంలో శుభ్‌మన్ గిల్‌ను జట్టు నుంచి డ్రాప్ చేయించినట్లే, ఇప్పుడు తిలక్ వర్మను కూడా బీసీసీఐ పక్కన పెట్టబోతుందా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. టీమిండియా ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన తర్వాత మళ్లీ ఇంటర్నేషనల్ మ్యాచ్‌లు ఆడటానికి సుమారు మూడున్నర నెలల సమయం పట్టింది. ఈ లోపే టీమిండియాలో సమూల మార్పులు జరిగాయి. అంతవరకు టీంను నడిపించిన సూర్యకుమార్ యాదవ్‌ను కప్ గెలిచిన వెంటనే కెప్టెన్సీ నుంచి మాత్రమే కాకుండా ఏకంగా జట్టు నుంచి తొలగించారు. తన స్థానంలో శ్రేయస్ అయ్యర్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించారు. మరోవైపు వరల్డ్ కప్ లో వైస్ కెప్టెన్‌గా ఉన్న సీనియర్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ నుంచి ఆ బాధ్యతలను లాక్కొని, యువ ఆటగాడు తిలక్?ను కొత్త వైస్ కెప్టెన్‌గా నియమించారు. అయితే ఈ రెండు నిర్ణయాలు కూడా ఇప్పటివరకు ఆశించిన రిజల్ట్స్ ఇవ్వకపోగా జట్టుకు మరిన్ని కష్టాలను తెచ్చిపెడుతున్నాయి. సెలెక్టర్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ పై దీర్ఘకాలిక ప్రణాళికలతో ఉన్నందున తనకు మరికొన్ని సిరీసులలో అవకాశాలు ఇచ్చే ఛాన్స్ ఉంది. కానీ వైస్ కెప్టెన్ తిలక్ వర్మకు ఆ ఛాన్స్ దక్కుతుందా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఐపీఎల్ అయిపోయినప్పటి నుంచి తిలక్ ప్రదర్శన గ్రాఫ్ క్రమంగా పడిపోతూ వస్తోంది. జట్టుకు అవసరమైన వేగంతో తను రుగులు చేయలేకపోతున్నాడు. దీనికి తోడు జట్టులో అతని బ్యాటింగ్ పొజిషన్ మారడం కూడా ఒక సమస్యగా మారింది. కొన్ని నెలల క్రితం వరకు టాప్ ఆర్డర్‌లో 3 లేదా నాలుగో స్థానంలో ఆడిన తిలక్.. ఈషాన్ కిషన్ రీఎంట్రీతో ఇప్పుడు 5 లేదా 6వ స్థానంలో బ్యాటింగ్‌కు రావాల్సి వస్తోంది. ఈ కొత్త రోల్‌లో తిలక్ పూర్తిగా ఇరుక్కుపోయాడు. ముఖ్యంగా స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో తను పడుతున్న ఇబ్బందులు టీంను కలవరపెడుతున్నాయి. తిలక్ వర్మ గణాంకాలను పరిశీలిస్తే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది. ఇంగ్లండ్‌తో జరిగిన గత 3 ఇన్నింగ్స్‌లలో కలిపి అతను కేవలం 114 స్ట్రైక్ రేట్‌తో కేవలం 40 పరుగులు మాత్రమే చేయగలిగాడు. అంతకుముందు ఐర్లాండ్ పర్యటనలో ఒక మ్యాచులో 74 పరుగులు చేసినప్పటికీ, అక్కడ కూడా అతని స్ట్రైక్ రేట్ కేవలం 100ంగానే ఉంది. ఆధునిక టీ20 క్రికెట్‌లో ఇంత తక్కువ స్ట్రైక్ రేట్‌తో ఆడటం టీం విజయాల మీద తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ఈ కారణంగానే ప్లేయింగ్ 11లో తిలక్ వర్మ స్థానంపై మాజీలతో పాటు ఫ్యాన్స్ కూడా తీవ్రంగా ప్రశ్నలు గుప్పిస్తున్నారు. ప్రస్తుత తిలక్ పరిస్థితిని చూస్తుంటే గతేడాది గిల్‌కు జరిగిన సీన్ గుర్తుకొస్తోంది. గిల్‌ను కూడా పెద్ద నమ్మకంతో టీ20 జట్టుకు వైస్ కెప్టెన్‌గా నియమించారు. కానీ ఆ తర్వాత జరిగిన ఆసియా కప్, ఆస్ట్రేలియా పర్యటన, సౌతాఫ్రికా సిరీస్‌లలో అతని బ్యాట్ పనిచేయలేదు. వైస్ కెప్టెన్‌గా ఉంటూ ఫాం కోల్పోవడంతో అతనిపై భారీ ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. చివరకు టీ20 ప్రపంచకప్‌నకు సరిగ్గా ముందే బీసీసీఐ అతని మీద వేటు వేసి జట్టు నుంచి తొలగించింది. ఇప్పుడు సరిగ్గా అదే పరిస్థితి తిలక్ వర్మకు కూడా ఎదురు అవుతోంది. వైస్ కెప్టెన్ హోదాలో ఉండి కూడా జట్టుకు భారంగా మారుతున్న తిలక్ వర్మ విషయంలో బీసీసీఐ తదుపరి ఎలాంటి కఠిన నిర్ణయం తీసుకుంటుందోనని క్రికెట్ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

## విగ్రహాల ఆవిష్కరణ జరిగిన తర్వాత

# మళ్లీ ముసుగులు ఎందుకు వేయించారు?

### ఎమ్మెల్యే కవ్వంపల్లిపై మాజీ ఎమ్మెల్యే రసమయి విమర్శలు



తిమ్మాపూర్, జనతా న్యూస్: తిమ్మాపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మహనీయుల విగ్రహాలను ఇప్పటికే ఆవిష్కరించిన తర్వాత మళ్లీ ముసుగులు వేయించడం ఎందుకని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను ప్రశ్నించారు. తిమ్మాపూర్ మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అంబేద్కర్ సంఘాలు, దళిత సంఘాల ప్రతినిధులతో కలిసి ఈ నెల 2న విగ్రహాలను ఆవిష్కరించినట్లు తెలిపారు. అనంతరం విగ్రహాలకు మళ్లీ ముసుగులు వేయించడం సమంజసం కాదని విమర్శించారు. విగ్రహాల ఏర్పాటుకు ప్రభుత్వ నిధులు వినియోగించలేదని, స్వంత నిధులతోనే ఏర్పాటు చేశామని తెలిపారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి అనుమతి కోరగా, ఆర్టీసీ ఎండీతో మాట్లాడి అనుమతి ఇప్పించారని చెప్పారు. నెలల తరబడి విగ్రహాలు ముసుగులతోనే ఉండటంతో విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరణ నిర్వహించామని పేర్కొన్నారు. ఆవిష్కరించిన విగ్రహాలకు తిరిగి ముసుగులు వేయడం, చిరిగిన వస్త్రాలు కప్పడం, మెడకు తాళ్లు వేయడం బాధాకరమని రసమయి ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో మహనీయుల విగ్రహాల ఏర్పాటు విషయంలో ఎమ్మెల్యే చొరవ చూపలేదని విమర్శించారు. అవసరమైతే నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టాలని, అధికారులను అడ్డుపెట్టి ఇలాంటి చర్యలకు పాల్పడవద్దని సూచించారు. ఈ అంశంపై జిల్లా అధికారులను కలిసి ఫిర్యాదు చేస్తామని, అవసరమైతే మళ్లీ ముసుగులు తొలగిస్తామని తెలిపారు. కేసులకు భయపడబోమని, ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అరుంధతి కళ్యాణ మండపం వ్యవహారంపై కూడా ఎమ్మెల్యేపై రసమయి ఆరోపణలు చేశారు. ఈ సమావేశంలో నాయకులు దేవేందర్ రెడ్డి, రావుల రమేష్, పాకాల మహిపాల్ రెడ్డి, రవీందర్ రెడ్డి, అశోక్ రెడ్డి, వంతడుపుల సంపత్, కొమురయ్య, రాధాకిషన్, వడ్లూరి శంకర్, సంగుపట్ల మల్లేశం, మహేష్, తిరుపతి, మురళి, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

## అభినందనీయం ఆ సర్పంచి నిర్ణయం



జనత న్యూస్ బెజ్జంకి : మండలంలోని వీరాపూర్ గ్రామ సర్పంచ్ చిలుమల సతీష్ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తీసుకున్న నిర్ణయం పట్ల గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేసినట్లు బుధవారం పత్రిక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం అమలుపరిచే ప్రతి అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన పథకాలలో మొదటి ప్రాధాన్యత ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకే ఉంటుందని నిర్ణయం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. దీనికి అనుగుణంగా సర్పంచ్ గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రత్యేక గుర్తింపు కార్డులను అందించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఇలాంటి నిర్ణయాలు ప్రతి గ్రామపంచాయతీ తీసుకుంటే ప్రభుత్వ పాఠశాలల మనుగడకు బలోపేతం చేకూరుతుందని , వీరాపూర్ సర్పంచి నిర్ణయాన్ని గ్రామ ప్రజలు అభినందించారు.

## నిరుపేదల ఆవాసాలకు అత్యంత ప్రాధాన్యత

**వడ్లూర్ సర్పంచ్ పులి రమేష్ గౌడ్.**



జనత న్యూస్ బెజ్జంకి : మండలంలోని వడ్లూరు గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు బెజ్జంకి లక్ష్మి – మల్లయ్య ల ఇంటి నిర్మాణం ముగ్గు పోసే కార్యక్రమానికి బుధవారం హాజరైన గ్రామ సర్పంచ్ సర్పంచుల ఫోరం మండల ఉపాధ్యక్షులు పులి రమేష్ గౌడ్ మాట్లాడుతూ , ఇండ్లు లేని నిరుపేదలు ఉండకూడదని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం తీసుకొచ్చిందని, మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తన నియోజకవర్గంలో, నివాసం కోసం ఆవాసాలు లేని నిరుపేదలకు ఇండ్లు నిర్మించాలని దృఢ సంకల్పంతో పనిచేస్తున్నారని , రానున్న రోజుల్లో ఇండ్లు లేని ప్రతి అర్హత కలిగిన నిరుపేద కుటుంబాలకు ఇండ్లు నిర్మించే లక్ష్యంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బెజ్జంకి మరియా అనిల్, వార్డు సభ్యులు పులి శ్రీకాంత్ గౌడ్, గాండ్ల రాధా తిరుపతి, పంచాయతీ కార్యదర్శి పద్మ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కుక్కల రాములు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాసూరి మల్లికార్జున్, మాజీ ఎంపీటీసీ కాసాని నరసయ్య, ఎస్టీ సేల్ మండల అధ్యక్షులు కట్ట కొమురయ్య, బెజ్జంకి అనిల్, రాగటి చంద్రయ్య, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## భూ సేకరణ పనులు వేగవంతం చేయాలి

**ఆర్అండ్ఆర్ కమిషనర్ కే. శివకుమార్ నాయుడు**



కరీంనగర్, జనతా న్యూస్: జిల్లాలో వివిధ సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూ సేకరణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆర్అండ్ఆర్ (రీహాబిలిటేషన్ అండ్ రీసెటిల్‌మెంట్) భూ సేకరణ కమిషనర్ కే. శివకుమార్ నాయుడు అధికారులను ఆదేశించారు. బుధవారం కరీంనగర్ కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, రెవెన్యూ, ఇరిగేషన్, భూ సేకరణ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖల అధికారులతో కలిసి భూ సేకరణ పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు, మిడ్ మానేరు, గౌరవెల్లి రిజర్వాయర్ కాలువలు, కాకతీయ కాలువ, కాళేశ్వరం ప్రాజెక్టు, కొత్తపల్లి--మనోహరాబాద్ రైల్వే లైన్, మానేరు రివర్‌ఫ్రంట్ తదితర ప్రాజెక్టులకు సంబంధించిన భూ సేకరణ పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ మాట్లాడుతూ, రెవెన్యూ, ఇరిగేషన్‌తో పాటు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అవార్డుల జారీ, పరిహారం చెల్లింపులు, పునరావాస కార్యక్రమాలను జాప్యం లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్వాసిత రైతులు, ప్రజలకు నిబంధనల మేరకు సకాలంలో పరిహారం అందించి పునరావాస చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ, జిల్లాలో భూ సేకరణ పనులు వేగవంతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, డీఆర్ఓ, భూ సేకరణ విభాగం ఇన్‌చార్జి ఎస్‌డీసీ స్వామి, ఆర్డీవోలు షర్మిల, జలకుమారి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కిషన్ రావు, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

**నాణ్యతతో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలి: జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**



జనతా న్యూస్ । జగిత్యాల । జూలై 8 మెట్‌పల్లి పట్టణంలో నిర్మాణ దశలో ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనం, ప్రభుత్వ వైద్యశాల భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించిన కలెక్టర్ ఎలాంటి జాప్యానికి తావు లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన విద్య, వైద్య సేవలు అందించడంలో ఈ భవనాలు కీలకమని పేర్కొంటూ, నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నాణ్యమైన నిర్మాణ సామగ్రినే వినియోగించాలని స్పష్టం చేశారు. ప్రతి దశలో ఇంజినీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టి పనుల నాణ్యతను నిర్ధారించాలని ఆదేశించారు. భవన నిర్మాణాలతో పాటు విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాలను కూడా సమాంతరంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ పరిశీలనలో జిల్లా విద్యాశాఖ అధికారి కె. రాము, ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది, తహసీల్దార్, ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు



కరీంనగర్, జనతా న్యూస్: అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి జన్మదిన వేడుకలను కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఆయన అభిమానులు, కాంగ్రెస్ నాయకులు, వివిధ సామాజిక సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, గత 36 ఏళ్లుగా విద్యారంగంలో నరేందర్ రెడ్డి అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. సాధారణ విద్యార్థులను అత్యుత్తమ ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దుతూ దేశంలోని ప్రముఖ విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందేలా చేసిన కృషి అభినందనీయమన్నారు. సాధారణ రైతు కుటుంబం నుంచి ఎదిగి తెలంగాణ విద్యారంగంలో ప్రత్యేక గుర్తింపు సాధించారని కొనియాడారు. జన్మదిన వేడుకల్లో భాగంగా తెలంగాణ చౌక్‌లో జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కిమ్ ఫహాద్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్, కమాన్ సమీపంలో ఎన్ఎస్‌యూఐ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు ఇమ్రాన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం, బస్టాండ్ వద్ద జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మునిగంటి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. చింతకుంటలో ఎస్టీ సెల్ అధ్యక్షుడు శ్రావణ్ నాయక్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్, దేశ్‌రాజ్‌పల్లిలో కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ చేపట్టారు. తెలంగాణ చౌక్‌లో జరిగిన కార్యక్రమానికి కరీంనగర్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ హాజరయ్యారు. అలాగే వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు, వీఎన్ఆర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## జెడ్పీహెచ్ఎస్ మల్యాపూర్‌లో కర్ణాటక సంగీత శిక్షణ శిబిరం



మల్యాపూర్, జనతా న్యూస్: భారతీయ శాస్త్రీయ సంగీత పరిరక్షణ సంస్థ (స్పిక్ మకే) తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విరాసత్--2026 కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ జిల్లా మల్యాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో కర్ణాటక సంగీత శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసుడు జె. సత్య శ్రీరామ్ విద్యార్థులకు భారతీయ శాస్త్రీయ సంగీత విశిష్టత, రాగాలు, తాళాలు, సంగీత సంప్రదాయాల గురించి వివరించారు. సంగీత ప్రదర్శనతో పాటు విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి, భారతీయ సంస్కృతి, సంప్రదాయ కళల పరిరక్షణలో యువత పాత్రను వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈ. అంజనేయులు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వహణ సంఘం (ఏఏపీసీ) చైర్మన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో ప్రధానోపాధ్యాయులు కళాకారులను సన్మానించి, ఇటువంటి శిక్షణ శిబిరాలు విద్యార్థుల్లో భారతీయ సాంప్రదాయ కళలపై ఆసక్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.

## వెండి ఫిలిగ్రీ యూనిట్లను సందర్శించిన అసిస్టెంట్ కలెక్టర్



కరీంనగర్, జనతా న్యూస్: కరీంనగర్ జిల్లాలో మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలు నిర్వహిస్తున్న వెండి ఫిలిగ్రీ తయారీ యూనిట్లను అసిస్టెంట్ కలెక్టర్ (శిక్షణలో) పి. హరి ప్రసాద్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మెప్మా పథక సంచాలకురాలు జి. స్వరూపారాణి ఆయనతో కలిసి సప్తగిరి కాలనీ, అశోక్ నగర్ ప్రాంతాల్లోని యూనిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వెండి ఫిలిగ్రీ కళాఖండాల తయారీ విధానం, మహిళలకు లభిస్తున్న ఉపాధి అవకాశాలు, ఉత్పత్తుల విక్రయాలు, ఆదాయ వృద్ధి తదితర అంశాలపై సభ్యులతో చర్చించారు. మహిళలు తయారు చేస్తున్న కళాఖండాలను పరిశీలించి వారి పనితీరును అభినందించారు. అసిస్టెంట్ కలెక్టర్ పి. హరి ప్రసాద్ మాట్లాడుతూ, కరీంనగర్ వెండి ఫిలిగ్రీ కళకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఉందని పేర్కొన్నారు. ఈ సాంప్రదాయ కళను స్వయం సహాయక సంఘాల మహిళల ద్వారా మరింత అభివృద్ధి చేసి, విస్తృత మార్కెట్ అవకాశాలు కల్పించడం ద్వారా వారి ఆదాయాన్ని పెంచవచ్చని సూచించారు. మెప్మా పథక సంచాలకురాలు జి. స్వరూపారాణి మాట్లాడుతూ, మహిళల ఆర్థిక సాధికారత కోసం నైపుణ్యాభివృద్ధి, విపణి అనుసంధానం, ఆర్థిక సహాయం వంటి పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. వెండి ఫిలిగ్రీ ఉత్పత్తులకు మరింత మార్కెట్ కల్పించి మహిళలకు స్థిరమైన జీవనోపాధి కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## కరీంనగర్‌లో ఘనంగా వృక్షారోపణ కార్యక్రమం



కరీంనగర్, జనతా న్యూస్: కరీంనగర్‌లోని నేషనల్ స్టాటిస్టిక్స్ ఆఫీస్ (ఎన్ఎస్ఓ) ఉపప్రాంత కార్యాలయం ఆధ్వర్యంలో తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పురుషుల డిగ్రీ కళాశాలలో గణితశాస్త్రం, గణాంకశాస్త్ర విభాగం సహకారంతో వృక్షారోపణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ (ఐఎస్ఎస్) రాజేష్ కుమార్, సీనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ గోవర్ధన శ్రీనివాసరావు, 6వ డివిజన్ కార్పొరేటర్ మేకల వెంకటేష్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె. అనూష, గణాంకశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం. ఉదయ్ శంకర్, అధ్యాపకులు, ఎన్ఎస్ఓ అధికారులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొని కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు.

## వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం: ప్రభుత్వ విప్ విజయరమణ రావు



పెద్దపల్లి, జనతా న్యూస్: దివంగత నేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద, అలాగే సుల్తానాబాద్ మున్సిపాలిటీ మొదటి వార్డు సుగ్లాంపల్లిలో నిర్వహించిన కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పేదలు, రైతులు, బలహీన వర్గాల సంక్షేమానికి వైఎస్సార్ విశేష కృషి చేశారని అన్నారు. ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్స్ సేవలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం, పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే, ఔటర్ రింగ్ రోడ్డు, రాజీవ్ రహదారి వంటి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఆయన దూరదృష్టికి నిదర్శనమని పేర్కొన్నారు. వైఎస్సార్ ఆశయాలు, ప్రజాసేవా స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని, ఆయన సేవలు చిరస్మరణీయమని విజయరమణ రావు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వెలిచాలలో ఘనంగా 'పోలీస్--మీ కోసం' కార్యక్రమం

### 40 సీసీటీవీ కెమెరాలను ప్రారంభించిన పోలీసు కమిషనర్ గౌష్ ఆలం : కమిషనరేట్‌లో మరో 700 కెమెరాల ఏర్పాటు లక్ష్యం



జనతా న్యూస్ । కరీంనగర్ । జూలై 8 కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రామడుగు మండలం వెలిచాల గ్రామంలో బుధవారం "పోలీస్--మీ కోసం" అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 40 సీసీటీవీ కెమెరాలను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ప్రారంభించారు. కార్యక్రమానికి గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు కలిపి 500 మందికి పైగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో సీసీటీవీ కెమెరాల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. వెలిచాల గ్రామంలో పాత కెమెరాల స్థానంలో అత్యాధునిక సాంకేతికతతో కూడిన 40 కొత్త కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని ప్రతి గ్రామం, ప్రతి వీధి సీసీటీవీ నిఘాలోకి తీసుకురావడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ క్రమంలో త్వరలో మరో 700 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా చిన్నారులు, యువత ఆన్‌లైన్ ఆటల వ్యసనానికి గురికాకుండా తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా ఆర్థిక నష్టాలను నివారించవచ్చని చెప్పారు. యువత మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో మత్తు పదార్థాల విక్రయం లేదా వినియోగంపై సమాచారం ఉంటే వెంటనే స్థానిక పోలీసులకు లేదా అత్యవసర పోలీసు సేవలకు సమాచారం అందించాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. రహదారి ప్రమాద బాధితులను సకాలంలో ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడిన వారికి ప్రభుత్వం అందిస్తున్న రూ.25 వేల ప్రోత్సాహకాన్ని కల్పించే 'రహవీర్' పథకం గురించి ప్రజలకు వివరించారు. సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన స్థానిక సర్పంచ్ వీర్ల నర్సింగరావు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులకు పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఏసీపీ విజయకుమార్, చొప్పదండి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ కుమార్, మాదకద్రవ్యాల నిరోధక విభాగం ఇన్‌స్పెక్టర్ రఫీక్, రామడుగు ఎస్సై రాజు, సర్పంచ్ వీర్ల నర్సింగరావుతో పాటు స్థానిక పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# గురుకులాల్లో నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించాలి: కలెక్టర్ హైమావతి

సిద్ధిపేట, జనతా న్యూస్: జిల్లాలోని అన్ని గురుకుల విద్యాసంస్థల్లో కామన్ డైట్ మెనూను తప్పనిసరిగా అమలు చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి గురుకుల యాజమాన్యాలను ఆదేశించారు. బుధవారం సిద్ధిపేట అర్బన్ మండలం మిట్టపల్లి శివారులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్ మధ్యాహ్న భోజన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అన్నం, వెజిటేబుల్ బిర్యానీ, ఆలుగడ్డ--టమాట కూర, గుడ్డు కూర, సాంబారు, పెరుగును పరిశీలించి, వెజిటేబుల్ బిర్యానీ నాణ్యతను అభినందించారు. ప్రతిరోజూ కామన్ డైట్ మెనూను పాటిస్తున్నారా, వంటకాల నాణ్యత ఎలా ఉందో ఆరా తీశారు. విద్యార్థుల హాజరుకు అనుగుణంగా వంట సామగ్రిని వినియోగించాలని, ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం అల్పాహారం, రాత్రి




భోజనాన్ని ప్రిన్సిపాల్ లేదా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని ఆదేశించారు. వంటగది, భోజనశాల, గురుకుల ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకుని దోమలు, ఈగలు వ్యాప్తి చెందకుండా చూడాలని సూచించారు. విద్యార్థుల్లో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించి సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను ఆదేశించారు.

# మీసేవ సేవలపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం

### వీఎల్ఈలకు దివ్యాంగ గుర్తింపు పత్రం, జాతీయ కుటుంబ ప్రయోజన పథక సేవలపై అవగాహన

జనతా న్యూస్ । సిద్ధిపేట । జూలై 8 జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సమన్వయంతో జిల్లాలోని అన్ని మీసేవ కేంద్రాల నిర్వహకులతో జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా ఈ-జిల్లా నిర్వహణాధికారి కమఠం ఆనంద్ కుమార్ అధ్యక్షత వహించగా, జిల్లా కార్యక్రమాల నిర్వహణాధికారి సరిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీసేవ కేంద్రాల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై సమగ్రంగా చర్చించారు. అలాగే దివ్యాంగుల ప్రత్యేక గుర్తింపు పత్రం సేవలు, జాతీయ కుటుంబ ప్రయోజన పథకం దరఖాస్తుల నమోదు, పరిశీలన, అర్హత ప్రమాణాలపై వీఎల్ఈలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. త్వరలో మీసేవ ద్వారా అందుబాటులోకి రానున్న కొత్త సేవల గురించి కూడా అధికారులు వివరించారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, నాణ్యమైన సేవలు అందించేందుకు వీఎల్ఈలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.




సేవల అమలులో సాంకేతిక సమస్యలు తలెత్తిన వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. మీసేవ కేంద్రాల్లో ప్రదర్శించిన రుసుముల పట్టికలో పేర్కొన్న రుసుములను మాత్రమే వసూలు చేయాలని, అదనపు రుసుములు తీసుకోరాదని అధికారులు స్పష్టం చేశారు. అలాగే సంబంధిత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్దేశించిన సేవలకు సంబంధించిన భౌతిక పత్రాలను తహసీల్దార్ కార్యాలయాలకు సమర్పించాల్సిన అవసరం లేదని వివరించారు. ప్రతి సేవలో పారదర్శకత, సమయపాలన, సేవాభావం పాటించడం ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత సమర్థవంతంగా అందించవచ్చని అధికారులు పేర్కొన్నారు. ఈ అవగాహన సదస్సు మీసేవ కేంద్రాల నిర్వహకులకు సేవల నిర్వహణపై మరింత స్పష్టతను కల్పించి, భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలు అందించేందుకు దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నిర్వాహకుడు నరేష్, సీఎస్‌సీ జిల్లా నిర్వాహకుడు శ్రీనివాస్‌తో పాటు జిల్లాలోని మీసేవ కేంద్రాల నిర్వహకులు పాల్గొన్నారు.

# జోనల్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ ముగింపు

### 21 విభాగాల్లో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి ప్రశంసలు -- రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విజేతలు

జనతా న్యూస్ । కరీంనగర్ । జూలై 8 : జోన్--3 పరిధిలోని కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సిద్ధిపేట, మెదక్, కామారెడ్డి జిల్లాల పోలీసు సిబ్బందికి నిర్వహించిన జోనల్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ విజయవంతంగా ముగిసింది. పోలీసు సిబ్బందిలో వృత్తిపరమైన నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం, దర్యాప్తు సామర్థ్యాలను పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన ఈ పోటీల్లో మొత్తం 21 విభాగాల్లో పరీక్షలు నిర్వహించారు. ఫోరెన్సిక్ శాస్త్రం, నేరాల దర్యాప్తు, నేర చట్టాలు, వేలిముద్రల శాస్త్రం, సైబర్ అవగాహన, నేరస్థల ఛాయాచిత్రాలు, వివిధ శోధన విధానాలు తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. పోలీసు శాఖలో దర్యాప్తు ప్రమాణాలను మరింత మెరుగుపరచడం, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించడం, సిబ్బందిలోని ప్రతిభను




వెలికితీయడం ఈ డ్యూటీ మీట్ ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. వివిధ విభాగాల్లో ఇన్‌స్పెక్టర్లు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, ఏఎస్ఐలు, పోలీసు కానిస్టేబుళ్లు విశేష ప్రతిభ కనబరిచారు. ఫోరెన్సిక్ శాస్త్రం, నేరాల దర్యాప్తు, వైద్య--న్యాయ పరీక్షలు, ఆధారాల సేకరణ, వేలిముద్రల శాస్త్రం, చిత్రణ పరీక్ష, పరిశీలనా పరీక్ష, వాహన, గది, భూభాగ శోధన, ప్రవేశ నియంత్రణ, ట్రాకింగ్, పేలుడు పదార్థాల గుర్తింపు, మాదకద్రవ్యాల గుర్తింపు, కంప్యూటర్ అవగాహన, కార్యాలయ నిర్వహణ, ప్రోగ్రామింగ్, ప్రజెంటేషన్, పోలీసు ఛాయాగ్రహణం, వీడియోగ్రఫీ తదితర విభాగాల్లో విజేతలను ప్రకటించారు. డ్యూటీ మీట్‌లో ప్రథమ స్థానాల్లో నిలిచిన విజేతలు త్వరలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో జోన్--3 తరఫున ప్రాతినిధ్యం వహించనున్నట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందిస్తూ రాష్ట్ర స్థాయిలోనూ ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ వెంకటరమణ, ఏసీపీలు శ్రీనివాస్ జి., వేణుగోపాల్, వెంకటస్వామి, ఇతర జిల్లాల పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రైతు భరోసా నిధుల విడుదలతో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

జనతా న్యూస్ । కరీంనగర్ । జూలై 8 రైతు భరోసా పథకం కింద రైతుల ఖాతాల్లో నిధులు జమ చేసిన సందర్భంగా కరీంనగర్ నియోజకవర్గంలోని కొత్తపల్లి మండలం బావాపేట్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం సంబరాలు నిర్వహించారు. కొత్తపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు స్వామి గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. రైతులను శాలువాలతో సన్మానించి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. రైతు భరోసా పథకం ద్వారా సంవత్సరానికి ఎకరానికి రూ.12 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తోందని తెలిపారు. గత వారం రోజులుగా ఒక ఎకరం నుంచి ఎనిమిది ఎకరాల వరకు భూమి కలిగిన రైతుల ఖాతాల్లో నిధులు జమ చేయడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. రైతు భరోసా, రైతు బీమా వంటి పథకాల ద్వారా రైతాంగానికి ఆర్థిక భరోసా కల్పిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతిగా నిలుస్తోందని ఆయన అన్నారు. వ్యవసాయ రంగానికి మరింత ప్రోత్సాహం అందిస్తూ రైతుల అభ్యున్నతికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు స్వామి గౌడ్, మడుపు మోహన్, బోనాల మురళి, అమ్మిడిశెట్టి కనకయ్య, దుర్గమ్మ, అంజయ్య, గురుమురళి, ప్రభాకర్, చంద్రయ్య, రావునేని సంపత్, గుండ మల్లేశం, సుంకె రాజు, బండపల్లి చందు, పెంట శేఖర్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com